# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 02-09-2022 ₹15/-




## ఆమ్ ఆద్మీ






## గురువు గొప్పతనం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 35 హైదరాబాద్
శుక్రవారం 2 సెప్టెంబర్ 2022 రూ.15-00
5 సఫర్ 1444 హిజ్రీ

**తొలిగీటు**

## విశ్వాసి అసభ్యంగా మాట్లాడడు. అశ్లీలం పలకడు. దుర్భాషలాడడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**
**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**
**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**
**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**
**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**
**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**
**సేల్స్ మేనేజర్**
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




## లోపల...

| | | |
|---|---|---|
| బేటీ బచావో ఇదేనా? | ...... | 04 |
| ఆమ్ ఆద్మీ | ...... | 05 |
| చరితార్థులు– మున్షీ సయ్యద్ ముహమ్మద్ మస్తాన్ బేగ్ | ...... | 10 |
| డ్రస్ కోడ్ | ...... | 11 |
| గురువు గొప్పతనం | ...... | 12 |
| ఈ కుల వివక్ష అమానుషం | ...... | 14 |
| ఇస్లామ్ సందేశ వ్యాప్తి | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| బద్ర్ తరువాత–1 | ...... | 20 |
| సిగ్గు బిడియాలు | ...... | 24 |
| మానవత... నైతికత... | ...... | 26 |
| ప్రేమను పంచండి | ...... | 28 |
| పిల్లలకు నీతికథలు చెబుతున్నారా? | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| మన జీవితం స్వల్ప పరీక్షా వ్యవధి | ...... | 34 |

### విష పురుగు...



మతోన్మాద రాజాతో
దేశమునకు చేటు
ఇలాంటి వీధికుక్కపై
వెయ్యాలి గట్టివేటు!
ఏరి పార వేయాలి
విషపూరిత బీజాన్ని
తుంచి పారవేయాలి
విద్వేష భావజాలాన్ని!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## బేటీ బచావో ఇదేనా?

**పదకొండు మంది** రేపిస్టుల విడుదల తర్వాత బిల్కిస్ బాను చేసిన వ్యాఖ్య మానవీయ విలువలున్న వారందరినీ కలచివేసే వ్యాఖ్య. కాని విద్వేషమే గుండెల్లో నింపుకున్న వారికి ఈ వ్యాఖ్యలోను రాజకీయం కనిపించవచ్చు. బిల్కిస్ బానుకు న్యాయం జరిగిందా అనే ప్రశ్న కన్నా ముందు ఆలోచించ వలసిన ప్రశ్న విడుదలైన రేపిస్టులకు పాదాభివందనం చేయడం, వారి ఆశీస్సులు కోరడం, పూలమాలలేసి సత్కరించడం ఎలాంటి సామాజిక వాతావరణాన్ని సూచిస్తోంది?

భారతదేశం 75వ స్వతంత్ర దినోత్సవం, ఆజాదీ కా అమృతోత్సవ్ జరుపుకుంది. నరేంద్రమోడీ మహిళల హక్కుల గురించి మాట్లాడారు. మరోవైపు ఈ పదకొండు మంది రేపిస్టులకు గౌరవసత్కారాలు జరిగాయి. ఈ నేరస్థుల్లో ఎలాంటి పశ్చాత్తాపం లేదు. తమకు జరుగుతున్న సత్కారాలు వారికి ఎలాంటి భయం లేదన్న భరోసా కూడా ఇస్తున్నాయి. మరోవైపు బాధితురాలు బిల్కిస్ బాను ఇంటిలో మరోసారి భయాందోళనల వాతావరణం అలుముకుంది. ఒక గర్భిణీ మహిళపై అతిక్రూరంగా సామూహిక అత్యాచారానికి పాల్పడి, ఆమె కళ్ళ ముందే మూడేళ్ళ పసిబాలుడిని చావగొట్టిన వారు ఇప్పుడు సమాజంలో గౌరవనీయులై పోయారు.

గుజరాత్‌లో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. దశాబ్దాలుగా గుజరాత్‌లో అధికారంలో ఉన్న బీజేపి ప్రజలకు చేసిందేమిటి? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గుజరాత్ ఎన్నికల్లో గెలవాలంటే హిందూ హృదయసామ్రాట్ తన పేరును నిలబెట్టుకోవాలి. గుజరాత్ ఘోరకలిలో, అనేకమంది అమాయకులు అతిక్రూరంగా హత్యలకు గురైన ఆ నాటి విషాదాల్లో, అతి క్రూరమైన నేరాలకు పాల్పడి శిక్షకు గురైన వారికి విడుదల ప్రసాదించడం గుజరాత్ ఎన్నికల విజయానికి ఉపయోగపడుతుందా? బహుశా ఉపయోగపడవచ్చు. ఎందుకంటే, ఈ నేరస్థుల పాదాలపై పడి ఆశిస్సులు కోరుతున్న వారిని చూస్తే, దేశంలో ఎలాంటి వాతావరణం ఏర్పడిందో అర్థం చేసుకోవడం కష్టం కాదు. అందువల్లనే చాలా మంది రాజకీయ విశ్లేషకులు ఈ నిర్ణయం వల్ల బీజేపీకి గుజరాత్‌లో రాజకీయ ప్రయోజనం ఉందంటున్నారు.

కాని, భారత ప్రజాస్వామిక విలువలకు, భారత న్యాయ వ్యవస్థకు ఈ సంఘటన ఎలాంటిది? ఢిల్లీ నగరంలో ఒక బస్సులో ఒక యువతిపై అమానుషమైన అత్యాచారం హత్య జరిగిన నిర్భయ కేసులో ఢిల్లీ నగరమంతా ఆ మహిళ కోసం గొంతెత్తింది. నిర్భయ చట్టం వచ్చింది. అత్యాచారానికి వ్యతిరేకంగా అప్పుడు ఉద్యమించి, కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించిన వారంతా ఇప్పుడు ఒక్కసారి బిల్కిస్ బానుపై అత్యాచారానికి పాల్పడిన నేరస్థుల విడుదల తర్వాత ఆలోచించవలసిన అవసరం ఉంది. బిల్కిస్ బాను కేసులో నేరస్థుల విడుదల ఆ తర్వాత ఇలాంటి అనేక కేసులకు దారితీస్తుంది.

బేటీ బచావో నినాదాలిచ్చే వారు కూడా ఆలోచించవలసిన అవసరం ఉంది.

ఈ పదకొండు మంది రేపిస్టుల విడుదల తర్వాత, ఈ కేసును విచారించిన న్యాయమూర్తి, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ యు.డి.సాల్వి మాట్లాడుతూ ఇది చాలా చెడ్డ సంప్రదాయం అవుతుందన్నారు. ఇప్పుడు ఇలాంటి అత్యంత హీనమైన అత్యాచారాల కేసుల్లో కూడా నేరస్థులు ఇలాగే విడుదల కోరవచ్చున్నారు. ఒకవైపు ప్రధానమంత్రి మహిళలను గౌరవించాలని చెబుతున్నప్పుడు, మరోవైపు ఆయన స్వరాష్ట్రం గుజరాత్ ప్రభుత్వం ఈ రేపిస్టులను విడుదల చేయడానికి మించిన ఐరనీ ఏముంటుందని ఆయన ప్రశ్నించారు.

బిల్కిస్ బాను కేసు భారతదేశంలోని ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది. కాని భారత విలువలేమయ్యాయన్నది ఆలోచించవలసిన ప్రశ్న.

అబ్దుల్ వాహెద్




# ఆమ్ ఆద్మీ

**భారత రాజకీయాల్లో** ప్రస్తుతం పరిస్థితి ఏమిటంటే, బీజేపీ అప్రతిహతంగా ముందుకు పోతోంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రతిపక్షాల ప్రభుత్వాలు కూల్చి తన జెండా పాతుతోంది. కాగా, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెసు, వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు తమ తమ ఓటు బ్యాంకులు కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఈ వాతావరణంలో బీజేపీకి దీటైన జవాబిస్తున్న పార్టీలు రెండే రెండు కనిపిస్తున్నాయి. ఒకటి పశ్చిమ బెంగాల్లోని తృణమూల్ కాంగ్రెస్, రెండవది ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ. బీజేపీ ఒత్తిళ్ళకు దీటుగా నిలబడుతున్నది ఈ రెండు పార్టీలే. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ మెడలు వంచడానికి మరోసారి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

భారతీయ జనతా పార్టీ తమ ఎమ్మెల్యేలను కొనడానికి ప్రయత్నాలు చేస్తోందంటూ ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రమైన ఆరోపణలు సంధించింది. కోట్లాది రూపాయలు ఎరగా వేస్తోందనే ఈ ఆరోపణలు కొత్త కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఆరోపణలతో స్పష్టంగా ప్రకటిస్తున్నదేమంటే, బీజేపీ ఒత్తిళ్ళకు లొంగేది లేదని, ఎదురుజవాబు చెబుతామని చాటి చెప్పారు.

రెండు పార్టీల మధ్య ఘర్షణ చాలా కాలంగా కొనసాగుతూనే ఉంది. ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్రం నియమించే లెఫ్టినెంట్ గవర్నర్‌కు మధ్య అనేక సందర్భాల్లో వివాదాలు తలెత్తాయి. ఇప్పుడు కొత్తగా ఢిల్లీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియా ఇంటిపై సిబిఐ దాడులు జరిగాయి. ఈ వివాదం కొత్త మలుపులు తిరుగుతోంది. గమనించవలసిన విషయమేమిటంటే, బీజేపీ విధానాలకు సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ చాలా సందర్భాల్లో మౌనం వహించింది. మిగిలిన పార్టీలు తీవ్రమైన నిరసన తెలియజేసిన సందర్భాల్లో కూడా ఆమ్ ఆద్మీ పార్టీ పెదవి విప్పలేదు. కాని ఇప్పుడు తమపై దాడులు జరిగిన వెంటనే దాడులను తిప్పికొట్టడానికి సమాయత్తమయ్యింది. బీజేపీని ఇరుకున పెట్టడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తోంది. సిసోదియా నివాసంపై సిబిఐ దాడుల వివాదాన్ని మరింత ముందుకు తీసుకు వెళుతోంది. బీజేపీపై దాడికి ఈ వివాదాన్ని ఉపయోగించుకుంటోంది.

సిసోదియా ఇంటిపై సిబిఐ దాడుల తర్వాత ఆప్ నాయకుడు రాఘవ్ చద్దా మాట్లాడుతూ సిసోదియా ఇంట్లో సిబిఐకి కేవలం పెన్సిళ్ళు, జామెట్రీ బాక్సులు మాత్రమే దొరికాయని అన్నాడు. మరో ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ మాట్లాడుతూ బీజేపీ ఆప్ శాసనసభ్యులను కొనడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిం

చాడు. ఇదే ఆరోపణ కేజ్రీవాల్ కూడా చేశారు. ఢిల్లీ ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ఆప్ అభివృద్ధి మోడల్ ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్న సందేశం స్పష్టంగా ప్రజల్లోకి వెళ్ళేలా ఆప్ నాయకులు మాట్లాడు తున్నారు. రాఘవ్ చద్దా చెప్పిన మాటలు గమనించదగ్గవి. సిబిఐకి సిసోదియా ఇంట్లో పెన్సిళ్ళు, జామెట్రీ బాక్సులు దొరికా యని చెప్పడం అంటే ఢిల్లీలో విద్యా వ్యవస్థను బాగుపరచడానికి ఆప్ చేసిన ప్రయత్నాలను ప్రజలకు గుర్తు చేయడం. ఆ విధంగా బీజేపీ ఈ ప్రయోజనాలు ప్రజలకు అందకుండా కుట్రలు చేస్తుందనే సందేశమివ్వడం. అలాగే ప్రజారోగ్యం విషయంలో ఆప్ తీసుకున్న చర్యలను కూడా ఈ సందర్భంగా ప్రజలకు గుర్తు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

నిజానికి బీజేపీకి ఆప్ పార్టీకి మధ్య తాజా ఘర్షణ చాలా రోజుల క్రితమే ప్రారంభమయ్యింది. సింగపూర్ ప్రభుత్వం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఢిల్లీ అభివృద్ధి మోడల్ గురించి మాట్లాడాలని కేజ్రీవాల్‌ను ఆహ్వానించారు. కాని కేంద్రప్రభుత్వం ఆయన వెళ్ళ కుండా అడ్డుకుంది. బీజేపీకి ఆప్ అంటే భయం పట్టుకుందని, ఆప్ ప్రతిష్ఠ పెరగడాన్ని సహించలేక, అసూయతోనే ఇలాంటి చర్యలు తీసుకుందనే ప్రచారం ఆప్ నాయకులు ప్రారంభించారు.

ఇక ప్రస్తుత సమస్య విషయానికి వస్తే, సిసోదియా ఇంటిపై సిబిఐ దాడులు, కొత్త ఎక్సయిజ్ పాలసీ, దానికి సంబంధించిన ఆరోపణల్లో నిజానిజాలు ఎలా ఉన్నప్పటికీ, ఈ వివాదాన్ని ఆప్ తనకు అనుకూలంగా మలచడం బీజేపికి మింగుడుపడని అంశం. ప్రతి పక్షాల ప్రభుత్వాలను కూల్చడమే ఎజెండాగా బీజేపీ పనిచేస్తుందని, నిరుపేదలకు మంచి చేస్తున్న ఆప్ ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నిస్తుందన్న సందేశం ఇప్పుడు స్పష్టంగా ప్రజల్లోకి వెళ్ళింది. ఈ వివాదం గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు ముగిసే వరకు కొనసాగవచ్చు. ఈ రెండు రాష్ట్రాల్లోను ఆప్ పార్టీ తన బలం పెంచుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తోంది. కనీసం బలమైన ప్రతిపక్షంగా ఈ రెండు రాష్ట్రాల్లో ఎదిగే ప్రయ త్నాల్లో ఉంది.

ప్రతి స్థాయిలోను ఆమ్ ఆద్మీ పార్టీ తనదైన శైలిలో బీజేపీకి పోటీ ఇస్తోంది. ఫలితమేమి టంటే, చాలా మంది కాంగ్రెసు కార్యకర్తలు ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ వైపు ఆకర్షితులవు తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీకి దీటుగా ఇస్తున్న జవాబు చాలా మందిని ఆకర్షిస్తోంది. బీజేపీయేతర పార్టీల కార్యకర్తలు చాలా మంది ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ వైపు చూస్తున్నారు. చివరకు బీజేపీ నుంచి కూడా కొందరు ఆప్ వైపు నడుస్తున్నారు.

విచిత్రమేమిటంటే, చాలా సందర్భాల్లో ఆప్ పార్టీని చాలా మంది బీజేపీకి బి టీముగా వర్ణించారు. చాలా సందర్భాల్లో ఆప్ పార్టీ కీలకమైన విధానపరమైన నిర్ణయాల విషయంలో కూడా బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. కాని తన రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోడానికి బీజేపీతో సై అంటే సై అనే స్థాయిలో పోటీ ఇస్తోంది. ఈ వ్యూహం ప్రత్యేకంగా గమనించదగింది. ఆప్ పార్టీకి ఒక సిద్ధాంతం లేదని చాలా మంది విశ్లేషించారు. కాని ఆప్ నాయకులపై అవినీతి ఆరోపణలు కూడా లేవు. అలాగే కేవలం పేదల సంక్షేమమే ప్రధానంగా పనిచేస్తున్న పార్టీగా కూడా ఒక స్థాయి గుర్తింపు పొందింది. గత ఎనిమిది సంవత్స రాలుగా బీజేపీ బలం పెరగడానికి కారణమైన రాజకీయ చర్చ ల్లోకి ఆప్ ఎన్నడూ ప్రవేశించలేదు. బీజేపీ మతతత్వ రాజకీయా లపై ఆప్ తన విధానం ఏమిటో ఎన్నడూ చెప్పలేదు. వివాదాస్పద మైన అనేక రాజకీయ నిర్ణయాలపై కూడా ఆప్ మౌనం వహిం చింది. ఈ చర్చల్లో తలమునకలవ్వడం ద్వారా ఇతర పార్టీలు బీజేపీ బలాన్ని పెంచాయని మరి కొందరి విశ్లేషణ. దేశంలోని ఇతర పార్టీల కన్నా విభిన్నమైన పార్టీగా ఆప్ తనదైన ఒక గుర్తింపు సాధించుకోగలిగింది. ఒకవైపు బీజేపీ బలం క్రమంగా పెరుగుతున్నప్పటికీ ఆప్ పార్టీ తన బలాన్ని కూడా మరోవైపు పెంచుకోగలిగింది. ఇప్పుడు బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదిగే సత్తా ఉన్న పార్టీగా గుర్తింపు పొందింది.

దేశవ్యాప్తంగా పార్టీ బలం విషయానికి వస్తే, ఇప్పటికి కూడా దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోను తనదైన కార్యకర్తల బలం ఉన్న పార్టీ కాంగ్రెసే. బిజేపీ నెమ్మదిగా ఆ స్థానాన్ని ఆక్రమించు


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

కునే ప్రయత్నాలు చేస్తోంది. ఆప్ పార్టీ ఈ విషయంలో చాలా వెనుకబడి ఉంది. ఆప్ రాజకీయాల పట్ల చాలా రాష్ట్రాల్లో ప్రజలకు ఆదరణ ఉన్నప్పటికీ ఈ ఆదరణను ఓట్లుగా మలిచే కార్యకర్తల బలం ఆప్ పార్టీకి లేదు. ఈ విషయం బీజేపీకి కూడా బాగా తెలుసు. కాంగ్రెస్ పూర్తిగా బలహీనమైపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ వ్యతిరేకత, ముస్లిం వ్యతిరేకత ఈ రెండింటి ద్వారా దేశాన్ని ఎంతకాలమైనా పాలించవచ్చును కుంటున్న బీజేపీకి ఇప్పుడు కొత్తగా ఆప్ పార్టీ సవాలు విసురుతోంది.

మతపరమైన వివాదాల్లోకి, ప్రజలను మతప్రాతిపదికన విభజించే వివాదాలు, చర్చల్లోకి ఆప్ ఎన్నడూ ప్రవేశించకుండా దూరంగా ఉండడం ఒక రాజకీయ ఎత్తుగడగా చాలా మంది విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే మరోవైపు భారత సమాజంలోని ఆర్థిక అసమానతలపై, పేదరికంపై మాట్లాడడం ద్వారా ఆప్ పార్టీ తనదైన ఒక ప్రత్యేక స్థానాన్ని కాపాడుకుంటూ వచ్చింది. ఆప్ ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి పెద్ద స్థాయిలో ప్రచారం కల్పించడం కూడా ఈ వ్యూహంలో భాగమే. కొన్ని సందర్భాల్లో అర్థసత్యాలు కూడా ఈ ప్రచారంలో వినిపించాయి. తమ ప్రభుత్వానిది చాలా ప్రత్యేకమైన అభివృద్ధి మోడల్‌గా ప్రచారం చేయడానికి పెద్దస్థాయిలో డబ్బు కూడా ఖర్చు చేశారు. ఇది నిజానికి మోదీ అనుసరించే వ్యూహం. కేజ్రీవాల్ అదే వ్యూహాన్ని తనదైన శైలిలో అమలు చేస్తున్నారు. కాని బీజేపీకి ఉన్న సాను కూలత ఆప్ పార్టీకి లేదు. బీజేపికి ఉన్న కార్పోరేట్ సపోర్ట్ ఆప్ పార్టికి లేదు. నిధులు బీజేపీతో పోటీపడే స్థాయిలో లేవు. అయినప్పటికీ ఆప్ పార్టీ ఒత్తిళ్ళకు లొంగని పార్టీగా నిలబడడం గమనించదగిన విషయం.

ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు రైతుల ఆందోళన ఇంకా అనేక సమస్యలు ముందుకు వచ్చాయి. బీజేపి వ్యతిరేకత పెరిగిందని అందరూ అనుకున్నారు. అయినప్పటికీ బీజేపీ ఉత్తరప్రదేశ్‌లో గెలిచింది. మరోవైపు పంజాబులో ఆప్ పార్టీ గెలిచింది. ప్రజా వ్యతిరేకత ఉన్నప్పటికీ బీజేపీ ఎందుకు గెలిచింది. ఆప్ పార్టీ పంజాబులో ఎలా బలం పెంచుకుంది అనే విషయాలు ఆలోచించవలసినవి.

ఆప్ పార్టీ 2015లో ఏర్పడినప్పటి నుంచి ఎన్నడూ మతం, కులం ప్రాతిపదికన ఓట్లు అడగలేదు. ఎవరో ఒక వ్యక్తిని ప్రధానంగా చూపించి ఓట్లు అడగలేదు. కేజ్రీవాల్ అంత చరిష్మా ఉన్న నాయకుడేమీ కాదు. కేజ్రీవాల్ పార్టీ అవినీతికి వ్యతిరేకంగా ఏర్పడిన పార్టీ. 2015లో పార్టీ క్రౌడ్ ఫండింగ్‌పై ఆధారపడింది. అనేక మంది వాలంటీర్లు దొరికారు. ఆ తర్వాత పార్టీ కేడర్‌గా మారారు. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఢిల్లీ సమస్యల్లో ముఖ్యమైనవి, తమ పరిధిలో ఉన్నవి విద్య ఆరోగ్య సమస్యల పరిష్కారానికి పూనుకున్నారు. అలాగే కరంటు, నీటి సరఫరా, మురికివాడల సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టారు. కులతత్వ, మతతత్వ రాజకీయాల వివాదాలు, చర్చలకు దూరంగా పని చేయడం ద్వారా కొన్ని ఫలితాలు కూడా సాధించి చూపించారు. ఆప్ ప్రజాదరణ పెరుగుతుందన్నది మోదీ కూడా గమనించారు. ఆప్ విధానాలు బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదగవచ్చన్న అవగాహన బీజేపీ నేతలకు కూడా ఉంది. ఆప్‌ను దెబ్బతీయ డానికి అనేక విధాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అప్పటి నుంచి బీజేపీ ఒత్తిళ్ళకు తలొగ్గేది లేదని ఆప్ స్పష్టమైన సందేశాలిస్తూనే ఉంది. పంజాబులో వైఫల్యాలు ఎదురైనప్పటికీ నిలబడి పోటీ చేసింది. చివరకు గెలిచి చూపించింది. మార్పు తీసుకువస్తామనే ఆశను ప్రజల్లో కల్పించడమే ఆప్ విజయ మంత్రం.

ఆప్ పార్టీ ఇప్పుడు ఓటర్లలోకి ఎలా చొచ్చుకుపోతుందో బీజేపీ గమనిస్తూనే ఉంది. అందువల్లనే ఆప్‌కు కళ్ళెం వేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ ముక్త్ భారత్ పేరుతో కేవలం కాంగ్రెసును మాత్రమే టార్గెట్ చేయడం ద్వారా బలం పెంచుకునే ప్రయత్నాలు ఇప్పుడు బీజేపీకి మరింత నష్టం కలిగించవచ్చు. పంజాబులో ఆప్ గెలుపు తర్వాత బీజేపికి ఈ ప్రమాదం మరింత పెరిగింది. వివిధ రాష్ట్రాల్లో బీజేపీ ఓట్ల శాతం 35 శాతం వరకు ఉంది. ఈ ఓట్లకు ఆప్ గండి కొడితే బీజేపీకి ప్రమాదం తప్పదు. అందువల్లనే సోషల్ మీడియాలో బలంగా ఉన్న బీజేపీ కార్యకర్తలు ఆప్ ప్రతిష్ఠ దెబ్బతీయడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నారు. రోహింగ్యాల వివాదం ఇంతకు ముందు ఆప్‌ను ఇరుకున పెట్టడానికి తీసుకువచ్చారు. ఆ వివాదంలో కూడా ఆప్ ఎదురుదెబ్బతీసింది.

హిమాచల్ ప్రదేశ్‌లో ఆప్ పార్టీని దెబ్బతీయడానికి బీజేపీ పూర్తి ప్రయత్నాలు చేసింది. ఆప్ నేతలపై మనీలాండరింగ్ కేసులు పడ్డాయి. ఇప్పుడు గుజరాత్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. కేజ్రీవాల్, సిసోదియాలు తరచూ గుజరాత్ సందర్శిస్తున్నారు. గుజరాత్‌లో బీజేపీ వ్యతిరేకత కూడా ఎక్కువగా ఉంది. ఆప్ బలం పెంచుకునే అవకాశాలు ఉన్నాయి. అందువల్లనే ఇటీవల మోడీ ఒక సభలో కేజ్రీవాల్‌ను ఉద్దేశించి ఉచిత తాయిలాల రాజకీయాలు నడిపిస్తున్నారని విమర్శించారు. ఈ విమర్శకు కూడా ఆప్ పార్టీ దీటైన జవాబిచ్చింది. మెజారిటీ మతతత్వ రాజకీయాలను ఎలా ఎదిరించాలో ఆప్ పార్టీ తనదైన వ్యూహంతో నిరూపిస్తోంది. ✤




**అత్యద్భుతమైన** ఈ దైవ సృష్టిలో చెట్లకు అత్యున్నత స్థానం ఉంది. అల్లాహ్ పోషణా గుణానికి, ఉపాధి కల్పనా లక్షణానికి చెట్లు పచ్చని తార్కాణాలు. పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా వుంది: "..ఆయనే ఆకాశం నుండి వర్షం కురిపించి రకరకాల మొక్కలు మొలకెత్తిస్తున్నాడు. తిరిగి ఆ మొక్కల నుండి పచ్చని పొలాలు, వృక్ష సంపదను పైకి తెస్తున్నాడు. వాటి ద్వారా పొరలు పొరలుగా ఒకదానిపై ఒకటి పడి ఉండే ధాన్యపు గింజల్ని, కాయల్ని పండిస్తున్నాడు. ఈ చెట్లు పుష్పించి, కాయలు కాసి, పండే తీరును పరికించి చూడండి. విశ్వసించే వారికి ఇందులో అనేక సూచనలున్నాయి."

మరొక చోట ఇలా ఉంది: 'అల్లాహ్ శిష్ట వచనాన్ని దేనితో పోల్చాడో గమనించండి. ఒక మేలు జాతి వృక్షం ఉంది. దాని వేళ్ళు భూమిలో బాగా లోతుకు దృఢంగా పాతుకుపోయి ఉన్నాయి. దాని శాఖలు నింగి దాకా విస్తరించాయి. అనుక్షణం అది తన ప్రభువాజ్ఞతో సుమధుర ఫలాలు అందజేస్తుంది. ప్రజలు గుణపాఠం నేర్చుకునేందుకు అల్లాహ్ ఇలాంటి ఉదాహరణలు ఇస్తున్నాడు. నిజానికి చెట్లు (అడవులు) అనంతమైన దైవ కారుణ్యానికి, ఆయన మహత్తుకు తిరుగులేని నిదర్శనాలు. మన జీవితాలకు, అడవులకు అవినాభావ సంబంధం ఉంది. మానవ మనుగడ, సమస్త ప్రాణికోటి మనుగడ అడవుల సంరక్షణపైనే ఆధారపడి ఉంది. అడవుల్ని సంరక్షించుకోకపోతే ప్రకృతి అసమతౌల్యానికి గురవుతుంది. అల్లకల్లోలం ప్రారంభమవుతుంది. అతివృష్టి, అనావృష్టి సమస్యలు తలెత్తుతాయి. దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటాయి. భవిష్యత్తు అంధకారమవుతుంది. దీనికి సంబంధించిన ప్రమాదఘంటిక ఇప్పటికే మోగింది. తక్షణం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది.

అందుకే ముహమ్మద్ ప్రవక్త సల్లం వారు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ దిశగా ప్రజల్ని ఎంతగానో ప్రోత్సహించారు. చెట్లను నరకడం వల్ల జరిగే అనర్థాలు, నష్టాలను గురించి ప్రజలను రకరకాలుగా హెచ్చరించారు. వాటిని సంరక్షించడం వల్ల ఒనగూడే ప్రయోజనాలను అత్యంత మనోహరంగా వివరించారు. చెట్టు నాటడం అత్యుత్తమ దానం (సదఖా) అని ఆయన ప్రవచించారు. మొక్కలు నాటడం వల్ల మానవాళికి అనంతమైన లాభాలు, శుభ శ్రేయాలు కలుగుతాయని చెప్పారు. ఆయన స్వయంగా మదీనాలోని హజ్రత్ సల్మాన్ ఫార్సీ(ర)గారి తోటలో మొక్కలు నాటి చెట్ల పెంపకం ప్రాధాన్యతను జనావళికి చాటి చెప్పారు.

వృక్షాలు మానవులకు జననం నుంచి మరణం వరకు తోడూ నీడగా ఉంటాయని, వాటిని నాశనం చేయడమంటే,

# ఎవరు ఎలాంటి వారో

ఎవరు ఎలాంటి వారో ఎలా తెలుసుకోవాలి? రంగును బట్టి, రూపును బట్టి లేదా సంపన్నతను బట్టి లేదా అతని ఉద్యోగం చూసి ఎలాంటి వాడో మనం అంచనా వేయ వచ్చా?

ఒకసారి హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు ఒక వ్యాజ్యం వచ్చింది. ఆయన (ర) ఆ వ్యక్తి విషయంలో విచారణ చేపట్టాలనుకున్నారు. తన ముందు కూర్చున్న వ్యక్తులతో 'ఫలానా వ్యక్తి ఎలాంటి వాడు?' అని అడిగారు. దానికి అక్కడ ఉన్న ఒక వ్యక్తి లేచి 'అతను చాలా మంచి వాడు అమీరుల్ మోమినీన్' అని సమాధానం ఇచ్చాడు. దానికి ఉమర్(ర) 'అతను మంచి వాడని నీకెలా తెలుసు?' అని అడిగారు. అందుకు ఆ వ్యక్తి 'అతను ఎప్పుడూ మస్జిద్‌కు వస్తూ పోతుంటాడు. అంటే అతను నమాజీ' అని విన్నవించుకున్నాడు. అప్పుడు ఉమర్(ర) 'ఒక వ్యక్తి ఎలాంటి వాడు? మంచి వాడా కాదా?' అని తెలుసుకోడానికి ఈ ఒక్క విషయం సరిపోతుందా' అని ప్రశ్నించారు. దానికి ఆ వ్యక్తి కొంచెం కంగారు పడి 'అంతకంటే ఇంకేం కావాలి ఖలీఫా?' అని అడిగాడు. అప్పుడు ఉమర్ (రజి) 'ఎప్పుడయినా నీకు అతని పొరుగున ఉండే అవకాశం వచ్చిందా?' అని అడిగారు. అతను 'లేదు' అన్నాడు. నువ్వు అతనితో ఎప్పుడయినా కలిసి ప్రయాణం చేశావా? అని మళ్ళీ అడిగారు. అతను 'లేదు' అన్నాడు. ఎప్పుడయినా అతనితో ఏదయినా విషయంలో ఏదైనా వ్యవహారం చేసి చూశావా? అన్నారు. అతను మళ్లీ 'లేదు' అని అడ్డంగా తల ఊపాడు.

ఒక వ్యక్తి ఎలాంటి వాడో తెలుసుకోవాలంటే మూడు విషయాలు చూడాల్సి ఉంటుంది. అతనితో ఏదయినా వ్యవహారం చేసి ఉండాలి? లేదా అతని పొరుగున అయినా ఉండాలి. లేదా అతనితో కలిసి ప్రయాణం చేసి ఉండాలి. ఈ మూడు విషయాలు మనిషి గురించి, అతని వ్యక్తిత్వం గురించి, అతని మంచి తనం గురించి తెలుపు తాయి.

మానవుడు స్వయంగా చేజేతులా వినాశనం కొని తెచ్చుకోవ డమేనని ప్రవక్త మహనీయులు సల్లం వారు బోధించారు. ఎవరైతే ఒక మొక్కను నాటి, అది పెరిగి పెద్దయ్యే వరకు దాన్ని సంరక్షిస్తారో, వారు చేసిన ఈ సత్కార్యానికి ప్రతిఫలంగా అల్లాహ్ స్వర్గంలో వారి కోసం ఒక చెట్టును నాటుతాడు అని కూడా ఆయన సెలవిచ్చారు. స్వర్గంలో అందమైన వనాలు, మధురమైన పళ్ళు, ఫలాలు ఉంటాయన్న వర్ణనలు పవిత్ర ఖుర్‌ఆన్‌లో అనేకం ఉన్నాయి. కనుక మానవ మనుగడకు ఇతోధికంగా తోడ్పడుతున్న చెట్లను, వృక్ష సంప దను పరిరక్షించు కోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాకుండా తాత్కాలిక ప్రయోజనాల కోసం వృక్ష విధ్వంసానికి పాల్పడుతూ బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తే భవిష్యత్తు అంధకారమవుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన 'హరిత హారం' ఒక మంచి బృహత్తర కార్య క్రమం. అయితే అందులో చిత్తశుద్ధి ఉండాలి. కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా బాధ్యతగా చేపట్టాలి. కోట్లు ఖర్చుపెట్టి మొక్కలు నాటడంతోనే బాధ్యత తీరిపోదు. వాటిని పెద్దయ్యే వరకూ పెంచాలి, సంరక్షించాలి. అప్పుడు మాత్రమే ఆశించిన ఫలితాలు పొందగలుగుతాము. కనుక సెల్ఫీల సోకులకు, ప్రచార ఆర్భాటానికి పరిమితం కాకుండా చిత్త శుద్ధిని ప్రదర్శించాలి. అదే ఇప్పుడు కావలసింది. ✤


గీటురాయి వారపత్రిక

**ముఖ్య ఆశయాలు**

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థా లను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

'చరితార్థులు'

# మున్షీ సయ్యద్ ముహమ్మద్ మస్తాన్ బేగ్ (1913 -1999)



140

**'మహాత్ముని** మాట నాకు బంగారు బాట' అంటూ చరమాంకం వరకు సాగిన గాంధేయవాది మున్షీ సయ్యద్ ముహమ్మద్ మస్తాన్ బేగ్ గుంటూరులోని సంగడిగుంటలో 1913 జూలై ఒకటిన జన్మించారు. తండ్రి మీరాసాహెబ్, తల్లి హుస్సేన్‌బీ. విద్యార్థిగా జాతీయోద్యమం పట్ల ఆకర్షితులైన ఆయన భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి 1932 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తొలిదశలో మాతృ భూమి కోసం ప్రాణ త్యాగాలు చేయడానికి సిద్ధమవుతున్న విప్లవకారుల పంథా తొలిదశలో ఆయన్ను అమితంగా ఆకర్షించింది. భారత జాతీయ కాంగ్రెస్ నిరసనలు, పికిటింగులు ఆయనకు నచ్చలేదు. 1935లో విప్లవకారులైన జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి రహస్య కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రముఖ విప్లవకారుడు అన్నాప్రగడ కామేశ్వరరావు నాయకత్వంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం గ్రామంలో 1936లో జరిగిన రహస్య రాజకీయ శిక్షణా శిబిరానికి హాజరయ్యారు. ఆ కారణంగా 21 రోజుల పాటు పోలీసులు కస్టడీలో ఉంచుకుని ఆయన్ను శారీరక-మానసిక హింసలకు గురిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఉర్దూ భాషలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన మస్తాన్ 1942లో తెనాలి తాలూకా ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. ఉపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడం కొనసాగించారు. క్విట్ ఇండియా పోరాటంలో భాగంగా 1942 ఆగష్టు 12న తెనాలిలో జరిగిన పోలీసు కాల్పులలో ఆయన వెంట్రుకవాసిలో మృత్యువు నుండి తప్పించుకున్నారు. 1943లో అన్నాప్రగడ నాయకత్వంలో రానున్న స్వాతంత్ర్యోత్సవ సంబరాలను పురస్కరించుకుని జరిగిన ఊరేగింపులో పాల్గొన్నారు. ఆ నేరానికి 1943 జనవరి 24 నుండి, ఫిబ్రవరి 7 వరకు జైలు పాలయ్యారు. ఆ తరువాత కార్యక్రమాలను మరింత ఉధృతం చేయగా ఆయన మీద అరెస్టు వారెంటు జారీ అయ్యింది. మస్తాన్ బేగ్ అజ్ఞాతంలోకి వెళ్ళి పార్టీ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ, 1942 జూన్ నుండి 1943 డిసెంబరు వరకు పోలీసులకు చిక్కలేదు. ముస్లింలీగ్ ద్వారా ప్రభావితులైన తెనాలి ప్రాంతంలోని కొందరు ఆయన వ్యవహారసరళి పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ప్రాణం ఉన్నంత వరకు భారత జాతీయ కాంగ్రెస్‌లో కొనసాగుతానని ఆయన ప్రకటించారు. స్వాతంత్ర్యం సిద్ధించే తరుణం సమీపించే కొద్ది ఒక సమస్యగా వ్యాపించిన 'భారత విభజన'ను వ్యతిరేకిస్తూ ఆయన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఉర్దూ భాష భారతీయుల ఉమ్మడి సంస్కృతికి చిహ్నమని ప్రకటించిన ఆయన ఆ మేరకు ప్రచారం చేశారు. స్వతంత్ర భారతంలో ఎదురైన ఆర్థిక కడగండ్ల కారణంగా రోజు గడవని దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. మిత్రుల బలవంతం మీద పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 1998లో పెన్షన్ మంజూరై బకాయిలుగా 21 వేలు రాగా ఆ మొత్తాన్ని ఉర్దూ భాషాభివృద్ధికి విరాళంగా సమర్పించిన ఉదార హృదయులు మున్షీ సయ్యద్ ముహమ్మద్ మస్తాన్ బేగ్ 1999 సెప్టెంబరు 29న తెనాలిలో చివరిశ్వాస విడిచారు. ✤



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# డ్రెస్ కోడ్

ముహమ్మద్ అలీ జిన్నా

**పూర్వం** బీదవారు కట్టుకోవడానికి బట్టలు లేక చినిగిన చోట మాసికలు వేసుకుని కాలం వెళ్ళదీసు కునేవారు. కాని నేడు ఎంత ఎక్కువ చినిగి ఉంటే అంత ఎక్కువ రేటుకు బట్టలు అమ్ముడుపోతు న్నాయి. ఎంత రంగు వెలిసిపోయి ఉంటే అంత ఎక్కువ డిమాండ్ ఆ దుస్తులకు!! నేడు ధనవంతులు, స్టూడెంట్స్ చిరిగిన ఈ దుస్తుల్లో తిరుగుతుంటే ఆశ్చర్యంగా ఉంది. అలాంటి దుస్తులు ధరించడం సిగ్గుగా భావించట్లేదు.

నేటి ముస్లిం పురుషులు తాము ఎలాంటి వస్త్రధారణతో ఉండాలి అనే విషయాన్ని పెడచెవిన వేస్తున్నారు. చినిగిపోయిన, క్రిందకు ఉండి ఊరంతా ఊడ్చే లేదా మోకాళ్ళకు పైన ఉండే దుస్తులు ధరిస్తు న్నారు.

పైజమా, ప్యాంటు వగైరా కాలి చీల మండలంకు పైకి ఉండేట్టు కట్టుకోవాలి. ఎవరైతే అహంతో గర్వంతో తమ పైజామా, లుంగీ మొదలైన వాటిని నేలకు రాసుకునేలా జారవిడుస్తారో మహ ప్రవక్త(స) దృష్టిలో వారు దౌర్భాగ్యులు, కఠినమైన శిక్షకు అర్హులు. ప్రవక్త(స) ఇలా వివరించారు: 'తుది దినాన దేవుడు మూడు రకాల వ్యక్తులతో మాట్లాడడు. వారిని కన్నెత్తి కూడా చూడడు, వారిని పరిశుద్ధపరిచి స్వర్గానికి పంపించడు; అంతేకాదు వారికి అత్యంత భయంకరమైన శిక్ష విధిస్తాడు. అప్పుడు హజ్రత్ అబూజర్ గిఫారి(రజి) అడిగారు- "దైవప్రవక్తా! ఎవరీ దౌర్భాగ్యులు?" అని. దానికి దైవప్రవక్త(స) "ఎవరైతే అహంకారంతో గర్వంతో తమ వస్త్రాన్ని చీల మండలం క్రిందికి వేలాడేలా ధరిస్తారో వారు.." (ముస్లిం)

మరో హదీసులో చీలమండలం క్రిందికి వేలాడే భాగం నరకాగ్నిలో కాలుతుందని ఉంది. కాని నేటి ముస్లింలు దీన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. కొందరు నిక్కర్లపై బహిరంగంగా తిరుగుతుంటారు. పురుషుని సతర్ నాభి నుండి మోకాళ్ళ వరకు అనే విషయాన్ని మరిచారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ పరిధిని మరువరాదు. మన పిల్లలకు కూడా పరిణీత దశలో ఈ విషయాన్ని తెలియజేయాలి. మన పెంపకం ఎలా ఉందంటే మగ పిల్లలకు చిన్నప్పటి నుండి 'నువ్వు మగవాడివి, ఎలాగైనా తిరగొచ్చు' అని నేర్పుతున్నారు. ఇక వారికి హద్దులు, పరిధులు ఎక్కడి నుండి తెలుస్తాయి?

బట్టలు ధరించడంలో సభ్యతను సంస్కా రాన్ని పూర్తిగా పాటించాలి. చొక్కా గుండీలు విప్పుకొని తిరగటం, గుండీలు కిందా పైనా పెట్టుకోవడం, షర్టు కింది భాగం ముడి వేయడం, మెడలో కర్చీఫ్‌లు ముడి వేసుకోవడం, కళ్ళు జిగేల్‌మనే రంగు బట్టలు, నగషీ, జరీ, ఎంబ్రాయిడరీ దుస్తులు, పూర్తిగా పైనుంచి కిందివరకు నలుపు లేదా కాషాయ వస్త్రాలు ధరించటం, జంతువుల బొమ్మలతో కూడిన వస్త్రాలు, వింతైన దుస్తులు ధరించడం చేయకూడదు.

మనం తొడిగే దుస్తులు మన స్థాయికి తగినట్లుగా ఉండాలి. అహంకారం, ప్రదర్శనాబుద్ధి, ఇతరుల్ని అల్పులని తలుస్తున్న భావన కలిగేలా, తమ సంపన్నత, దర్పం అగుపడే వస్త్రాలు ధరించకూడదు.

దైవప్రవక్త(స) తెల్లని బట్టలను ఎంతో ఇష్టపడేవారు. తెలుపు వస్త్రాల ప్రత్యేకత ఏమిటంటే, ఎంత చీప్‌గా కొన్నా, ఎంత ధన వ్యయంతో కొన్నా అవి అహంభావాన్ని, న్యూనతను కలగజేయవు.

మాసిపోయిన, దుమ్ము ధూళి నిండిన, కంపుకొట్టే వస్త్రాలు ధరించి ప్రజల్లోకి పోకూడదు. మురికిగుడ్డలు తొడుక్కున్న ఒక వ్యక్తిని చూసి దైవప్రవక్త(స) 'బట్టలు ఉతుక్కోవడానికి ఇతని వద్ద ఏ పదార్థమూ లేదా' అని అడిగారు. దైవప్రవక్త(స) తమ బట్టలను స్వయంగా తామే ఉతుక్కునేవారు.

వస్త్రధారణలో మధ్యేమార్గాన్ని అవలంబించాలి. లోభత్వం లేదా దుబారా లేకుండా చూసుకోవాలి. అల్లాహ్ సుందరుడు, సౌందర్యాన్ని ఎంతో ప్రేమిస్తాడు. మనం ధరించే దుస్తులతో పరిశు భ్రంగా, సుందరంగా కనబడేలా ప్రయత్నం చేయాలి. బట్టలు చూడగానే ఇతను మర్యాదస్తుడు అనే భావన కలిగేలా ఉండాలి. మన బట్టల ద్వారా మనలోని దైవభీతి (తఖ్వా) ఉట్టి పడుతుండాలి.

హుమేరా అమీర్, ఏలూరు

# గురువు గొప్పతనం



**డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్** దేశానికి చేసిన సేవలను గుర్తించి ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 5 వ తేదీని టీచర్స్‌డే జరుపుకోడానికి గల కారణం - రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు ఆయన పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని కోరారట. ఆరోజు నుంచే ఉపాధ్యాయ వృత్తికి ఆయన తెచ్చిన గుర్తింపు, గౌరవానికిగాను ప్రతీ సంవత్సరం ఆయన పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవ డం మొదలయింది.

ఉపాధ్యాయుల పాత్ర గురించి చెప్పాలంటే, విద్యార్థులు జ్ఞానం, సామర్థ్యం లేదా సత్ప్రవర్తన సంపాదించడానికి సహాయపడే వ్యక్తి ఉపాధ్యాయుడు. కేవలం పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ బోధించే వారే ఉపాధ్యాయులు కాదు, ఈ ఉపాధ్యాయుడి పాత్రను ఎవరైనా పోషించవచ్చు. ఒక తల్లి తన బిడ్డకు మొదటి గురువు. నేర్చుకోవాలనే తపన, సామర్థ్యం ఉండాలేగానీ ఒక మనిషి నుండి మరో మనిషి నేర్చుకోవడమే కాదు, ఈ ప్రకృతిలోని ప్రతి జీవ, నిర్జీవరాశి కూడా మానవుడికి పాఠాలు నేర్పిస్తుంది. కానీ ఈ పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ బోధించే ఉపాధ్యాయులు మాత్రమే విద్యార్థుల జీవితాల్లో ప్రత్యేక పాత్రను పోషిస్తారు. ప్రతీ విద్యార్థికి జీవితం పట్ల ఆశయం, అవగాహన ఏర్పడేది మాత్రం తరగతి గదిలోనే. అందువల్ల విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుడిదే. ఈ బాధ్యత కేవలం విధుల ఆధారంగా కాకుండా విద్యార్థి జీవితంతో వాత్సల్యంతో ముడి పెట్టుకుంటే ఉపాధ్యాయులు వారి విద్యార్థుల జీవితాలను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దగలుగుతారు.

### విద్యార్థి భవిష్యత్ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

విద్యార్థి జీవితం పూలబాటలో వెళ్తుందా? ముళ్లబాటపై పయని స్తుందా అనేది పాఠశాల తరగతి గదిలోనే ఉపాధ్యాయుల ద్వారా నిర్ణయించబడుతుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బోధన చేసే ఉపాధ్యాయులు, భవిష్యత్తులో విద్యార్థులకు సహాయపడే సూచనలను అందించే ఉపాధ్యా యులు మాత్రమే విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషించినవారు అవుతారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కఠినమైన వ్యక్తిత్వంతో వ్యవహరించినప్పటికీ, వారు తమ విద్యార్థుల పట్ల దయ మరియు ప్రేమతో వ్యవహరించాల్సి ఉంటుంది.

### విద్యార్థుల్ని భయపెట్టకుండా బోధించాలి..

ప్రతి విద్యార్థి ఆలోచనా తీరు, నేర్చుకునే సామర్థ్యం వేరుగా ఉంటుంది. అందరి విద్యార్థుల ఆలోచనా విధానం ఒకేలా ఉండదు కాబట్టి వారిలో కొంతమంది చదువుకోవడానికి ఇష్టపడతారు, మరికొందరు విద్యార్థులు అసలు ఇష్టపడరు. కాబట్టి, విద్యార్థులు నేర్చుకోవడాన్ని ఇష్టపడే విధంగా, అభ్యాసంపై దృష్టి సారించే విధంగా బోధించడం ఉపాధ్యాయుని బాధ్యత. వారు ఉపన్యాస పద్ధతిలో కాకుండా విద్యార్థులు చదువుపై ఇష్టాన్ని పెంచుకునే విధంగా ఉత్తేజపూరితమైన పద్ధతిని అవలంబించాలి.

## విద్యార్థులను ప్రోత్సహించాలి

ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు కేవలం బోధించడమే కాకుండా అవసరాన్ని బట్టి కొన్ని పనులు అంటే, విద్యార్థులను ప్రోత్సహించడం, మంచి పనులలో ప్రేరేపించడం, వారికి మార్గ నిర్దేశనం చేయాలి. విద్యార్థి ప్రతిభను చూసి, మెచ్చుకుని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తే, అది విద్యార్థులకు మరింత ప్రోత్సాహ కరంగా ఉంటుంది.

## విద్యార్థి విషయ పరిజ్ఞానాన్ని గుర్తించి, పనితీరు లక్ష్యాలను నిర్ధారించడం

తమ విద్యార్థుల విషయ పరిజ్ఞానం ఎంతవరకూ ఉంది? జీవితంలో వారు వెళ్ళవలసిన గమ్యం ఏమిటి? అనేది ఉపాధ్యాయుడికి ఖచ్చితంగా తెలిసి ఉండాలి. అందువల్ల వారు తమ విద్యార్థులకు వారు చేరవలసిన గమ్యం ఏమిటి? దానికి విద్యార్థులు ఎంతవరకు కృషి చేయాలి? అనేది తెలియజేస్తూ, స్వీయ-మూల్యాంకనం ద్వారా విద్యార్థులు తమ స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకునేలా చేయడం, వారి భవిష్యత్ అభివృద్ధి కోసం వారి యొక్క ప్రణాళికలను పరిపరివిధాల గుర్తు చేస్తూ ఉండాలి. అంతేకాదు చేరవలసిన గమ్యం వైపు విద్యార్థులు వేసే ప్రతి అడుగును పర్యవేక్షించడం ద్వారా విద్యార్థుల మనో విశ్వాసాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు అనేక విధాలుగా పని చేయవలసి ఉంటుంది.

## తల్లిదండ్రుల్లా చూసుకోవాలి...

విద్యార్థులు ఇంట్లో తమ తల్లిదండ్రులతో గడిపే సమయం కంటే పాఠశాలలో గడిపే సమయం ఎక్కువ. అందువల్ల విద్యార్థులకు తమ తల్లిదండ్రులతో ఎంత సఖ్యతతో ఉంటారో ఉపాధ్యాయులతో కూడా అంతే సఖ్యతగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల ఉపాధ్యాయుడు కేవలం తన పని షెడ్యూల్ను అనుసరించి నిర్దిష్ట పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాదు విద్యార్థులకు ఉత్తమమైన భవిష్యత్తును అందించడానికి తమ శాయశక్తులా కృషి చేయాలి.

## విద్య నేర్చుకుంటేనే...

"మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు" (దివ్య ఖుర్ఆన్ 96:5) అని ఖుర్ఆన్ బోధిస్తోంది. పుట్టుకతోనే ఏ వ్యక్తి పరిపూర్ణుడు కాడు. విద్య నేర్చుకుంటేనే పరిపూర్ణుడు కాగలడు. విద్య నేర్పించాలంటే ముందుగా ప్రతి వ్యక్తి విద్య నేర్చుకోవడం తప్పనిసరి. దైవ ప్రవక్త ముహమ్మద్ (స) నైతికత, దైవభక్తి మరియు సరైన ప్రవర్తనను బోధించారు. ఆయన ప్రజలకు మౌఖికంగా బోధించడమే కాదు, తాను ఏదైతే బోధిస్తూ వచ్చారో అదే తన జీవితం అంతా పాటిస్తూ వచ్చారు. ఒక ఉపాధ్యాయుడు అంటే కేవలం చెప్పడం మాత్రమే కాదు. తాను చెప్పేది ముందుగా తాను ఆచరిస్తేనే అది అతని వృత్తికి వన్నె తెస్తుంది. అతని విద్యార్థులు కూడా ఆ ఉపాధ్యాయుడిని గౌరవిస్తారు, ప్రేమిస్తారు. తద్వారా ఆ గురువు బాటలోనే పయనించి తమ జీవితాలను సార్థకం చేసుకుంటారు.

అలీఘర్లోని ఉమెన్స్ కాలేజ్ స్థాపకుడైన షేక్ అబ్దుల్లాహ్ అనే యువకుడిని అతడు చదువుకునే రోజుల్లో అతని ఉపాధ్యాయుడు ఒక ప్రశ్న అడిగారు. "మనుషులకు, పశువులకు మధ్య ఉన్న తేడా ఏమిటని"? దానికి అతను ఇచ్చిన సమాధానం, "మనిషి తాను నేర్చుకున్న దాన్ని ఇతరులకు నేర్పించగలడు, తద్వారా ప్రతి తరంలో విద్యావేత్తలు పెరుగుతూ ఉంటారు, ఈ పనిని జంతువులు చేయలేవు" అన్నాడు. అందుకే మానవ చరిత్రలో నాగరికతలు ఎన్ని మారినప్పటికీ దివ్య జ్ఞానాన్ని అందించే అధ్యాపకుడి గౌరవం మాత్రం మారదు. విద్యను నేర్పే గురువులుగా, భవిష్యత్తు మార్గదర్శకులుగా తమ జీవితాలను విద్యార్థుల జీవితాల కోసం అంకితం చేస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి "ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు"

## అందరికంటే గౌరవనీయుడెవరు?

కసాయి.. సుప్రసిద్ధ అరబిక్ విద్వాంసులు. ఖలీఫా హారూన్ రషీద్ కుమారులు అమీన్, మామూన్లకు రోజూ పాఠాలు బోధించేవారు. ఒకానొక రోజు కసాయి పిల్లలిద్దరికీ పాఠాలు చెప్పి ఇంటికి బయలుదేరసాగారు. రాకుమారులిద్దరూ గురువు గారి చెప్పుల దగ్గరకు పరుగుతీశారు. చెప్పులను సరిచేసేపనిలో ఇద్దరూ ఒకే చెప్పును పట్టుకున్నారు. ఇద్దరిలో పేచీ వచ్చింది. నేనంటే నేను సరిచేస్తానని చిన్నపాటి ఘర్షణకు దిగారు. గురువుగారు సర్ది చెప్పడంతో చెరొక చెప్పును దులిపి ఆయన కాళ్లముందుంచారు. ఈ విషయం ఖలీఫా హారూన్ రషీద్కు తెలిసింది. నిండు సభలో కసాయిని రప్పించారు. "ప్రపంచంలో అందరికంటే గౌరవనీయుడు ఎవరు?" అని గురువు గారిని అడిగారు.

'ఇంకెవరుంటారు ఖలీఫాకంటే గౌరవనీయుడెవరుంటారు?" అని చెప్పారు గురువు.

"ఎవరి కాలి మేజోళ్లు సరిచేయడానికి ఖలీఫా కుమారులు పోటీ పడ్డారో వారే గౌరవనీయులు" అన్నారు ఖలీఫా

ఖలీఫా మాటలకు గురువు కసాయి వణికిపోయారు. ఈరోజు తన పని అయిపోయిందనుకున్నారు. జరిగిన దానికి మన్నించమని ఖలీఫాను ప్రాధేయపడ్డారు.

"మీ చెప్పులు సరిచేయడం వల్ల నా వారసుల గౌరవమర్యాదలేమీ తగ్గలేదు. పైగా వారిద్దరి గౌరవ ప్రతిష్టలు పెరిగాయి" అని చెప్పడంతో గురువు గారు ఊపిరిపీల్చుకున్నారు.

మనిషి ఎంత గొప్పవాడైనా ముగ్గురిని తప్పకుండా గౌరవించాలని చెప్పారు. తల్లిదండ్రులు, గురువు, ఖలీఫా ఈ ముగ్గురూ గౌరవాదరణలకు అర్హులు అని చెప్పారు.

– తస్లీన్



# ఈ కుల వివక్ష అమానుషం!

- హాఫిజ్ ముహమ్మద్ ఖాసిమ్ షర్ఫీ, గజ్వేల్

M.A., M.Ed

**పుట్టడం,** చావడం అనేది ప్రతి జీవి విధి ధర్మం. పుట్టడానికి ఒకే కారణమైనా చావడానికి మాత్రం వంద కారణాలుంటాయి. కాని నేను ఇక్కడ మీ ముందుకు తీసుకువస్తున్న చావు సంఘటన సాధారణమైనది కాదు. దీని వెనుక వేల సంవత్సరాల చరిత్ర వుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, అంటరానితనం, బానిసత్వం, అస్పృశ్యత, కులం, మతం, ధనం, బలం, పలుకుబడి, వర్ణ వ్యవస్థకు జాత్యాహంకారానికి మధ్య జరుగుతున్న సంఘర్షణలో అనేకమంది అమాయకులు బలవుతున్నారు. మహిళలు, బాలికలు, హత్యాచారాలకు గురవుతున్నారు. సాధారణ మరణాలకంటే అసాధారణ మరణాలే ఎక్కువయ్యాయి. ఇది సమాజపు దుష్పరిణామం.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లా సురానాకు చెందిన 3వ తరగతి చదువుతున్న 9 సంవత్సరాల ఇంద్రకుమార్ మేఘ్వాల్ జాత్యాహంకారానికి బలయ్యాడు. అతని తల్లిదండ్రులు ఇతర పిల్లల్లాగే తన పిల్లాడు కూడా ఉన్నత చదువులు చదివి సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలనే కలలుకని జాలోర్ సరస్వతి విద్యామందిర్ అనే ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు కట్టి చదివిస్తున్నారు. ఆ పాఠశాలలో రెండు కుండల పద్ధతి ఉంది. అగ్రకులాల పిల్లలు, ఉపాధ్యాయులు త్రాగడానికి ఒక కుండ, దళితులు, నిమ్న కులాల పిల్లలు త్రాగడానికి మరో కుండ వేర్వేరుగా ఉన్నాయి. 3వ తరగతి చదువుతున్న ఇంద్రకుమార్ అనే పసిబాలునికి దాహం వేసింది. అతని కులం, దాని వెనుకాల ఉన్న చరిత్ర తెలియదు. దాహం తీర్చుకోవాలని మాత్రమే వాడికి తెలుసు. తనకు కనిపించిన కుండలో నీళ్ళు తీసుకుని తాగాడు. అలా తాగడాన్ని చూసిన టీచర్ చైల్‌సింగ్ నీవు దళితుడివి. అంటరానివాడివి, నేను త్రాగే కుండలోని నీళ్ళు త్రాగుతావా అని అమాయకపు బాలునిపై విరుచుకుపడ్డాడు. ఇష్టం వచ్చినట్టు కొట్టాడు, అతని దెబ్బలకు ఆ బాలుడి చెవి పగిలి పోయింది. కళ్ళు ఉబ్బిపోయాయి. కాళ్ళు చేతులలో చలనం లేదు. పూర్తి స్పృహ కోల్పోయాడు. ఈ సంఘటన జులై 20న జరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన తమ పిల్లాడిని లోకల్ ఆస్పత్రికి, అక్కడి నుండి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పక్క రాష్ట్రమైన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు తీసుకెళ్ళారు. అయినా ఫలితం లేదు. చివరికి ఆ బాలుడు 23 రోజులు మృత్యువుతో

పోరాడి ఆగస్టు 13న మరణించాడు. ఆ బాలుడు ఇంట్లో, స్నేహితులతో పాఠశాలలో చురుకుగా ఉండేవాడని, పాఠశాలలో చదువుల్లో, ఆటపాటల్లో, డ్యాన్సుల్లో ప్రతిభ కలవాడని తెలిసింది. అతను భవిష్యత్తులో రీల్ హీరోనో లేదా రియల్ హీరోనో అవుతానని అనుకోవచ్చు. కాని 9 సంవత్సరాలకే వందేళ్ళు నిండాయి. అతను సమాజంలోని మానవ మృగాల్లో పేరుకుపోయిన కుల గజ్జికి, వర్ణ వ్యవస్థకు బలయ్యాడు.

ఇలాంటి సంఘటనలు మనదేశంలో రోజురోజుకు పెరుగుతూ పోతున్నాయి. ఇది మొదటి సంఘటన కాదు. చివరి సంఘటన కాదు. కొన్ని వెలుగు చూస్తున్నాయి. కొన్ని కనుమరుగవుతున్నాయి. నేను ఇక్కడ దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు అనే పదం వాడను. ఎందుకంటే ఆ పదం వాడినట్లయితే ఒప్పుకున్నట్లవుతుంది. వారి ఊహా చిత్రం జీవన విధానం మన మస్తిష్కాల్లో మెదులుతుంది. నేను వారిని ఆర్యులని, భారత మూలవాసులని, సింధు నాగరికత వాళ్ళని అంటాను. వాళ్ళు ద్రవిడియన్ ధాటికి తట్టుకోలేక వారికి బానిసలుగా, కూలి పనివాళ్ళుగా అవతారమెత్తారు. ఇదే వారికి పట్టిన శని, ఇదే చివరికి వర్ణ వ్యవస్థగా మారి సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చేసింది. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వ్యవస్థ వేర్లు సమాజంలో పేరుకుపోయాయి. విస్తరించాయి. వాటిని ఎంత నరికినా చిగురిస్తూనే ఉంది. తద్వారా మెహ్ఫ్యూల్ లాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఒకడు గుర్రపు స్వారీ చేశాడని చంపుతున్నారు. మరొకడు మీసాలు పెంచాడని చంపుతున్నారు. టక్, బూట్లు వేసుకున్నాడని చంపారు. మరో చిన్నపిల్లాడు దొర వద్ద పనికి ఆలస్యంగా వచ్చాడని చెట్టుకు కట్టి నిప్పంటించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట, గరగపరుగు, గోపాలపురం, రావులపాలెం వంటి సంఘటనలు మన ముందుకు వస్తాయి. ఈ సంఘటనల ద్వారా అనేకమంది అమాయక ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఈ సందర్భంలో దివ్య కుర్ఆన్ ఏమంటుందంటే, “మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు”.

పైన పేర్కొన్న ఖుర్ఆన్ అధ్యయనం ద్వారా మనకు తెలిసిందేమంటే మానవులంతా సమానమే. కేవలం మానవుడు తన కర్మల ద్వారా, వ్యక్తిత్వం ద్వారా, దానగుణం ద్వారా మాత్రమే దేవుని వద్ద శ్రేష్ఠుడు, ఉత్తముడు.

నేడు మానవుడు తన దేహానికి వచ్చే పెద్ద పెద్ద రోగాలకు మాత్రం తక్షణమే మందులు కనుక్కుంటున్నాడు. ఆకాశ హర్మ్యాల వంటి ఆస్పత్రులను నిర్మించుకుంటున్నాడు. యావత్ ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా లాంటి మహమ్మారి తీవ్రతను ఒక సంవత్సరంలోనే కట్టడి చేయగలిగాడు. కాని సామాజిక రుగ్మతలను, అసమానతలను, అంటరానితనాన్ని, హత్యాచారాలను, మూక హత్యలను, రాజకీయ దౌర్జన్యాలను మాత్రం గాలికి వదిలేస్తున్నాము. కట్టడి చేయలేక పోతున్నాము. దీనిపై తగిన చర్యలు తీసుకోకపోతే అది మొత్తం సమాజాన్ని విషతుల్యం చేస్తుంది. అప్పుడు మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది.


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని ‘Geeturai Weekly’ పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**ఇస్లామ్** సందేశ వ్యాప్తికి మూడు విషయాలు చాలా ప్రధానమైనవి. ఒకటి, ఇస్లామ్ ధర్మంలోని సాధారణ విశ్వాసాలు- ఆకట్టుకునే ఆరాధనలు. రెండు, ముస్లిముల జీవితాలలో దాని బోధనల ఫలితాలు. మూడు, ముస్లిములలో సందేశ ప్రచార అభిరుచి.

మొదటిది- మనసుకు సంబంధించింది. అది మనస్సును వేడుకుంటుంది.

రెండోది- భావోద్వేగాలను ప్రేరేపిస్తుంది.

మూడోది- ఒక మంచి మార్గదర్శి మాదిరిగా దారి తప్పిన వారిని రుజుమార్గంలోకి తీసుకొస్తుంది.

మార్కెట్‌లో ఒక మంచి వస్తువు ఉంది. దానిలో ఎన్నో ప్రత్యేకతలుంటాయి. దాని విక్రయానికి ఇవే సరిపోవు. దానిలో ఉన్న ప్రత్యేకతలను, దానివల్ల కలిగే ప్రయోజనాలను తెలిపే ప్రచారకర్తలు కూడా చాలా అవసరం. దాన్ని వినియోగించి లబ్ధి పొందిన ప్రత్యక్ష సాక్షులు కూడా కావాల్సి ఉంటుంది. అప్పుడే ఆ వస్తువు ప్రజాదరణ పొందుతుంది. అదేవిధంగా ప్రపంచంలో ఇస్లామ్ వ్యాప్తి కోసం ఈ మూడు విషయాలు సమానంగా అవసరమవుతాయి. ఇందులో ఏ ఒక్కటి తగ్గినా ఇస్లామ్ వ్యాప్తి వేగంపై దీని ప్రభావం పడుతుంది. ఈ మూడు విషయాలు ఎలా ప్రభావం చూపుతాయో. దాని ఫలితాలు ఎలా ఉంటాయో చూద్దాం.

## ఇస్లామీయ విశ్వాసాలు చాలా సాధారణమైనవి

ఇస్లామీయ విశ్వాసాలు చాలా సామాన్యమైనవి. మనస్సుకు నచ్చేవి. ఒక సాధారణ మనిషి కూడా వాటిని అంగీకరించడానికి సిద్ధపడతాడు. వాటిలో ఎలాంటి తత్వ బోధ ఉండదు. శంకలు కలిగించే విషయాలు ఉండవు. రహస్యాలూ ఉండవు. కొన్ని స్పష్టమైన, సరళమైన నియమాలుంటాయి. వాటిని బుద్ధి చాలా సులువుగా గ్రహించగలుగుతుంది. వాటిని గ్రహించిన తరువాత మనిషి తనలో వింతయిన విప్లవం వచ్చినట్లు భావిస్తాడు. అందులోని ప్రతి విషయం అత్యంత స్పష్టంగా, ఖచ్చితంగా ఉంటుంది. అందులో ఎలాంటి సంశయం ఉండదు. దైవానికి సంబంధించి అది చాలా స్పష్టంగా విశ్వాసాన్ని పేర్కొంది :

"మీ దేవుడు కేవలం ఒక్కడే". (అంబియా : 108)

మరొకని సందేహం లేదు

"ఇద్దరిని దేవుళ్ళుగా చేసుకోకండి". (అన్ నహ్ల్ : 51)

ఆయనకు సహాయకుని అవసరమూ లేదు. ఎందుకంటే,

"నిశ్చయంగా ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు." (అల్ బఖర : 20)

"తనకు ఇష్టమైన దానిని చేసే అధికారం అల్లాహ్‌కు ఉంది". (ఇబ్రాహీమ్ : 27)

"నిస్సందేహంగా అల్లాహ్ తాను కోరిన ఆజ్ఞను జారీ చేస్తాడు". (మాయిదా : 1)

"ఆయనకు సంతానం లేదు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు" (ఇఖ్లాస్ : 3,4)

ఆయనకు ఎటువంటి మానవావసరాలు కలగవు.

"సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు." (అల్ బఖర : 255)

మానవుడు సహాయం కోరగల శక్తి ఈ భూమ్యాకాశాలలో అల్లాహ్ తప్ప మరొకటి లేదు.

"భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్‌కే చెందుతుందని, ఆయన తప్ప మిమ్మల్ని సంరక్షించేవారు, మీకు సహాయం చేసేవారు మరెవ్వరూ లేరనే సంగతి మీకు తెలియదా?" (అల్ బఖర : 107)

ఆరాధనలకు అర్హుడు ఆయనే.

"నీవు ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకిస్తూ అల్లాహ్‌కు మాత్రమే దాస్యం చెయ్యి" (జుమర్ : 2)

అదేవిధంగా దేవుడు దైవదౌత్యం గురించి కూడా ప్రవక్త ఒక మనిషి తప్ప మరేమీ కాదని స్పష్టంగా, సూటిగా తెలియజేశాడు. దేవుడు తన దాసుల వరకు తన సందేశాన్ని చేరవేయడానికి వారిని నియమించుకున్నాడని విశదపరిచాడు.

"ప్రవక్తా! ఇలా చెప్పు; నేను కేవలం ఒక మానవుణ్ణి, మీలాంటి వాణ్ణి, నాకు వహీ ద్వారా ఇలా తెలుపబడింది." (అల్ కహఫ్: 110)

"ప్రతి జాతి కొరకూ ఒక మార్గదర్శకుడు ఉన్నాడు" (అర్ రాద్ : 7)

ఆచరణలు, బాధ్యతల గురించిన పరిహారం, ప్రతిఫలం ఈ ప్రపంచంలో దొరకదని స్పష్టపరిచాడు.

"ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసి ఉన్నాసరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుష్కార్యం చేసి ఉన్నా సరే దాన్నీ అతను చూసుకుంటాడు." (అజ్ జిల్‌జాల్: 7,8)

ప్రళయానికి సంబంధించి ఇస్లామ్ పేర్కొన్నటువంటి విశ్వాసాలు ఏ ధర్మమూ పేర్కొనలేకపోయింది. మనిషి తన జీవితంలో చేసిన ఆచరణల ప్రతిఫలాన్ని మరణానంతర జీవితంలో తప్పకుండా పొందుతాడు. అదే అసలైన జీవితం.

ఇస్లామ్ విశ్వాసాలు ఎంత సాధారణమైనవంటే మానవ మేథ దానిని చాలా సులభంగా గ్రహించగలుగుతుంది. ఇస్లామీయ సందేశ ప్రచారకులు తమ కార్యంలో సఫలీకృతులవడానికి కారణం కూడా ఇదే.

మానవ మనస్సుపై ఆ విశ్వాసాల ప్రభావం ఎంత తీవ్రంగా పడుతుందో ఈ సంఘటన ద్వారా మనం అంచనా వేయవచ్చు.

ఒకసారి ఒక యూరప్ యాత్రికుడు ఆఫ్రికాలోని గాలా జాతికి చెందిన స్వతంత్ర్య బానిసను కలిశాడు. కొందరు అతన్ని బాల్యంలో జంజ్ తీరం నుంచి పట్టుకెళ్ళి జెద్దాలో విక్రయించారు. యాత్రికుడు ముక్తిపొందిన ఆ బానిసతో "నిన్ను అన్యాయంగా పట్టుకుని పశువుల మాదిరిగా అమ్మిన వారి పట్ల నీకు ద్వేషం కలగడం లేదా?" అని అడిగాడు. దానికి ఆ నీగ్రో బానిస ఇలా సమాధానం ఇచ్చాడు : "అవును, నా మనసులో వారి పట్ల ద్వేషం ఉండటం సహజమే. కాని ఒక విషయం దాన్ని మరిచిపోయేలా చేసింది. అదేమిటంటే, వారి కారణంగానే నేను తిరస్కార అంధకారం నుంచి బయటపడలిగాను. ఈ దేశానికి రావడం, నాకు ఇస్లామ్ సౌభాగ్యం ప్రాప్తం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. విశ్వాస మాధుర్యానికి మించిన మాధుర్యం మరేదీ లేదు. ఆ మాధుర్యాన్ని మనస్సే గ్రహించగలుగుతుంది. నోరు వెల్లడించలేదు."

## ఆకట్టుకునే ఇస్లామీయ ఆరాధనలు

ఇస్లామీయ ఆరాధనలు కూడా ఆకట్టుకునే విధంగా ఉంటాయి. ప్రతి మనస్సు వాటి పట్ల ఆకర్షితమవుతుందని మాంటిస్క్యూ ఉద్ఘాటించారు. ఒక యూద వ్యక్తి ఇలా రాశాడు : "నేను కేవలం ముస్లిముల ఆరాధనా విధానం చూసి విశ్వాసిగా మారిపోయాను. ఒకసారి నేను జామియా మస్జిద్‌లో నమాజ్ దృశ్యాలు తిలకించాలని వెళ్ళాను. మొదట నా మనస్సుపై ప్రభావం చూపిన అంశం ఖుత్బా. అందులోని ఒక్కో అంశం నా హృదయంపై ప్రభావం చూపించడం ప్రారంభించింది. ముఖ్యంగా ఖతీబ్ "ఇన్నల్లాహ యామురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాన్. వఈతాయి జిల్ ఖుర్బా వ యన్హా అనిల్ ఫహ్‌షాయి వల్ మున్‌కరి వల్ బగ్‌యి" న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనే అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడునూ, అశ్లీలతనూ, అన్యాయాన్నీ, మితిమీరి ప్రవర్తించడాన్నీ నిషేధిస్తున్నాడు." (అన్ నహ్ల్ : 90) అనే ఆయత్ పఠించినప్పుడు ఇలాంటి ఉన్నత విలువలు బోధించిన దేవుడు, ధర్మం పట్ల

**మిగతా 23వ పేజీలో...**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

85 ఆయత్‌లు

# 40. అల్ మూ'మిన్

మక్కా అవతరణ

65 ఆయనే నిత్య సజీవుడు, ఆయన తప్ప మరే ఆరాధ్యుడూ లేడు. ఆయనకే మీరు మొరపెట్టుకోండి– మీ ధర్మాన్ని ఆయన కోసమే ప్రత్యేకించుకుని.[93] స్తుతిసర్వమూ విశ్వప్రభువు అల్లాహ్‌కే అంకితం.[94]

66 ప్రవక్తా, ఈ జనులకు చెప్పివెయ్యి, మీరు అల్లాహ్‌ను వదలి ఎవరినయితే మొరపెట్టుకుంటూ ఉంటారో ఆ అస్తిత్వాలను ఆరాధించడం పట్ల నన్నయితే వారించడం జరిగింది.[95] (నేనిది ఎలా చేయగలను) నా వద్దకు నా ప్రభువు వద్ద నుండి ప్రస్ఫుటమయిన సూచనలు వచ్చేసిన తరువాత; నాకు ఆదేశమూ ఇవ్వడం జరిగింది, నేను నిఖిల జగతి ప్రభువు సమక్షాన విధేయతా శిరస్సును వినమ్రం చెయ్యాలని.

67 – 68 ఆయనే కదా మిమ్మల్ని మట్టితో సృష్టించాడు, తరువాత రేతస్సు బిందువుతో, తరువాత రక్తపు ముద్దతో, తరువాత ఆయన మిమ్మల్ని శిశువు రూపంలో వెలికి తెస్తాడు, మిమ్మల్ని పెద్దవారిగా చేస్తాడు, మీరు మీ పూర్ణ శక్తికి చేరుకోవాలని, పిదప ఇంకా పెంచుతాడు మీరు వృద్ధాప్యానికి చేరుకోవాలని. మరి మీలో ఒకడు ముందే తిరిగి రప్పించుకోబడతాడు.[96] ఇదంతా మీరు నిర్ణీత సమయానికి చేరుకోవడానికే;[97] ఇంకా మీరు యదార్థాన్ని గ్రహించడానికే.[98] ఆయనే జీవనాన్ని ప్రసాదించేవాడు, ఆయనే మృత్యువునూ ఇచ్చేవాడు. ఆయన ఏ విషయాన్ని నిర్ణయించినా కేవలం ఒక ఆదేశమిస్తాడు అది నెరవేరాలని, అది నెరవేరుతుంది.

---

93. వివరణకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.7, అజ్జుమర్ : పాద సూచికలు 3, 4.

94. అంటే, స్తుతి, కీర్తనలు గానం చెయ్యడానికి, కృతజ్ఞతలు అర్పించుకోవడానికి ఆయన తప్ప మరెవ్వరూ లేరు.

95. ఇక్కడ మరోసారి 'దుఆ' (ప్రార్థన)ను, "ఇబాదత్" (ఆరాధన)ను ఒకే అర్థంలో ప్రయోగించడం జరిగింది.

96. అంటే ఒకరు పుట్టక మునుపు, మరొకరు యవ్వనానికి చేరుకోక మునుపు, ఇంకొకరు వృద్ధాప్యానికి చేరుకోక మునుపు చనిపోతారు.

97. నిర్ణీత సమయం అంటే మృత్యు సమయమయినా కావచ్చు, లేదా మానవులంతా తిరిగి లేచి తమ దైవం సన్నిధానంలో హాజరయ్యే సమయమయినా కావచ్చు. మొదటి అర్థమయితే భావం, అల్లాహ్ ప్రతి మానవునికి జీవితపు విభిన్న దశల గుండా సాగనిచ్చి ఆ ప్రత్యేక ఘడియ వరకు తీసుకువెడతాడు. ఆ ఘడియను ఆయన ప్రతి ఒక్కరికీ మరలి పోవడానికి నిర్ణయించి ఉంచాడు. ఆ సమయం రాకముందు ప్రపంచం మొత్తం కలసి ఎవరినయినా చంపాలని అనుకున్నా చంపజాలదు. ఆ సమయం వచ్చేసిన తరువాత ప్రపంచంలోని శక్తులన్నీ కలసి ఎవరినయినా సజీవంగా ఉంచే ప్రయత్నం చేసినా ఫలవంతం కాలేవు. రెండవ అర్థమయితే భావం, ఈ జగతి హంగామా అంతా మీరు మరణించి మట్టి అయి పోవడానికి, నశించిపోవడానికి ఏర్పరచబడలేదు. జీవితపు ఈ విభిన్న దశల గుండా మిమ్మల్ని సాగనిచ్చేది, మీరంతా ఆయన నిర్ణయించిపెట్టిన ఆ సమయాన ఆయన సమక్షంలో హాజరవ్వాలని మాత్రమే.

98. అంటే జీవితపు ఈ విభిన్న దశల గుండా మిమ్మల్ని సాగనిచ్చేది, మీరు పశువుల్లా బ్రతకడానికి, పశువుల్లానే మరణించడానికి కాదు. అల్లాహ్ మీకు ప్రసాదించిన బుద్ధి నుపయోగించి ఈ వ్యవస్థను అర్థం చేసుకోవడానికి. ఇందులో స్వయంగా మీ వ్యక్తిత్వంపైన ఈ పరిస్థితులు ప్రభావం చూపుతాయి – భువిలోని జీవంలేని పదార్థాలలో జీవితం వంటి వింతయిన విచిత్రమయిన అంశం పుట్టడం, తరువాత ఇంద్రియ బిందువులోని ఒక సూక్ష్మ క్రిమి ద్వారా మానవుని వంటి ఆశ్చర్యకరమయిన సృష్టిరాశి ఉనికిలోకి రావడం, తరువాత తల్లి కడుపులో గర్భం దాల్చిన ఘడియ నుండి ప్రసవం జరిగే సమయం వరకు లోలోనే మానవుని పోషణ జరగడం, అతని లింగం, రూపం, ఆకారం, శరీర నిర్మాణం, అతని మానసిక ప్రత్యేకతలు, అతని శక్తులు, సామర్థ్యాలు, సర్వమూ అక్కడే నిర్ణయమవడం, అవి ఏర్పడటంలో ప్రపంచంలోని ఏ శక్తీ జోక్యం చేసుకోలేకపోవడం దేన్ని సూచిస్తున్నాయి?

(98వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (4వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## 1. సాక్ష్యాధారాల ప్రకరణం

### అధ్యాయం : 18

### పిల్లలు ప్రాజ్ఞులవటం, వారి సాక్ష్యం గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:"మీ పిల్లలు యుక్త వయస్సుకు చేరుకున్నప్పుడు, తమ పెద్దలు అనుమతి తీసుకునే విధంగానే వారు కూడా అనుమతి తీసుకుని మరీ రావాలి." (అన్ నూర్: 59). "నాకు పన్నెండేళ్ళ ప్రాయంలోనే వీర్య స్ఖలనం అవటం మొదలయింది"[1] అని ముగీరా (రజి) చెప్పారు. ఆడపిల్లలు ప్రాజ్ఞతకు చేరుకున్నారనడానికి నిదర్శనం 'రజస్వల' అయి బహిష్టు మొదలవటం. దీనికి ఆధారం ఖుర్ఆన్‌లోని ఈ దైవోపదేశం: "మీ స్త్రీలలో ఎవరయినా ఋతుక్రమం విషయంలో ఆశ వదులుకుంటే, వారి విషయంలో మీకేదైనా అనుమానం కలిగితే, అప్పుడు వారి నిర్ణీత గడువు మూడు మాసాలు (అని మీరు తెలుసుకోండి). ఇదే ఆజ్ఞ ఇంకా ఋతు క్రమం ప్రారంభం కాని వారికి కూడా వర్తిస్తుంది. గర్భిణీ స్త్రీల నిర్ణీత గడువు వారి కాన్పు అయ్యేవరకు ఉంటుంది." *(అత్ తలాఖ్ : 4)*

**28) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : ఉహుద్ యుద్ధ సందర్భంగా తాను ప్రవక్త మహనీయుల (సఅసం) సన్నిధికి వెళ్ళి (యుద్ధరంగానికి వెళ్ళేందుకు అనుమతి ఇవ్వమని అడిగి)నప్పుడు, ఈయనకు అనుమతి లభించలేదు. అప్పటికి ఈయన వయస్సు 14 ఏండ్లు. కందక పోరాటం సందర్భంగా హాజరైనప్పుడు మాత్రం ఆనతి లభించింది. అప్పటికి ఈయనకు 15 సంవత్సరాలు నిండాయి. నాఫె ఇలా అన్నారు: నేను ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ) ఖలీఫాగా ఉన్న కాలంలో ఆయన దగ్గరకు వెళ్ళి, ఈ హదీసును వినిపించినప్పుడు, ఆయన గారు 15 ఏండ్ల వయో పరిమితిని చిన్న- పెద్దకు మధ్య హద్దుగా ఖరారు చేశారు. తరువాత ఆయన తన అధికారులకు లేఖలు వ్రాస్తూ, ఏ పిల్లవానికి 15 ఏండ్లు నిండుతాయో, అతనికి ప్రభుత్వ కోశాగారం నుండి (సైనిక) పెన్షన్‌ను నిర్ధారించండి అని ఆదేశించారు.[1]**

18-1. అంటే 12 ఏండ్ల వయసులోనే ఆయన యుక్త వయసుకు చేరుకున్నారు. అమ్ర్ బిన్ ఆస్ కూడా తన కుమారుడు అబ్దుల్లాహ్ కన్నా కేవలం 12 ఏండ్ల పెద్దవారని అంటారు. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫియి, అహ్లె హదీసు వారి దృష్టిలో పురుషుని ప్రాజ్ఞతకు కనిష్ఠ వయసు 15 సంవత్సరాలు. స్త్రీ రజస్వల అవటంతోనే ఆమె ప్రాజ్ఞతకు చేరుకుంటుంది. కాగా కనీసం 18 లేక 19 ఏండ్లు రానంతవరకు పిల్లలు యుక్త వయసుకు చేరుకోలేరని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ) వక్కాణించారు.

ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది: స్త్రీకి బహిష్టు అయినప్పుడు, పురుషునికి వీర్య స్ఖలనం అవటం మొదలైనప్పుడు వారు యుక్త వయస్కులవుతారని కొందరు అభిప్రాయపడ్డారు. మర్మస్థానం వద్ద వెంట్రుకలు మొలవటం యుక్త వయస్సుకు తార్కాణమని మరి కొందరన్నారు.

వాస్తవమేమంటే, ప్రాజ్ఞతకు 'వయోపరిమితి'ని ఖచ్చితంగా నిర్ధారించటం చాలా కష్టం. అది ఆయా దేశాల భౌగోళిక, వాతావరణ పరిస్థితులపై ఆధారభూతమై ఉంటుంది. అరేబియా వంటి ఉష్ణ ప్రదేశాలలో ఆడపిల్లలు పదేండ్లలోనే రజస్వల అవుతారు. రష్యా వంటి శీతల ప్రదేశాలలో ఆడవారు 20 ఏండ్ల వరకూ 'పెద్ద మనుషులు' అవరు. ఇకపోతే బాలల సాక్ష్యం గురించి; అత్యధిక మంది విద్వాంసులు బాలల సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా పరిగణించలేదు. అయితే పిల్లలు పరస్పరం కొట్లాడుకుని ఒకరింకొకరిని గాయపరిచే వయస్సుకు చేరినప్పుడు వారి సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని ఇమామ్ మాలిక్(రహ్మ) వక్కాణించారు.

28-1. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే, 15 ఏండ్ల వయసుకు చేరుకోగానే పిల్లలపై షరీఅత్ ఆజ్ఞలు విధితమవుతాయి. వారు సాక్ష్యం కూడా ఇవ్వగలుగుతారు.

# బద్ర్ తరువాత-1



38

- ఎస్.ఎమ్. మలిక్

**సత్యాసత్యాల** తొలి రణరంగం బద్ర్ మైదానంలో పరమ ప్రభువు దైవ సందేశహరులకు, ఆయన సహచర మాన్యులకు మహత్పూర్వక విజయాన్ని అనుగ్రహించాడు. అరేబియా నేలలో నివసించే వారంతా ఇస్లామీ సత్యత విజయాన్ని, మిథ్యా వాదాల పరాజయాన్ని చూసుకున్నారు. ముఖ్యంగా బహు దైవారాధకుల పైన ముస్లిముల భయం ఆవహించింది. మరీ ముఖ్యంగా మక్కా ముష్రికులు (బహుదైవారాధకులు) తమ బుద్ధీ వివేకాలనే కోల్పోయారు, వారికి ఇక ఏమి చెయ్యాలో తోచలేకపోతోంది. వారి అహంకారమంతా మంట కలసిపోయింది. ముఖమెత్తి తిరిగే స్థాయి లేకపోయింది.

బహుదైవారాధకులే కాక యూదులు సయితం ఈ విజయానంతరం కింకర్తవ్యం? అని ముస్లిముల పట్ల తమ అక్కసును వెళ్ళగ్రక్కేందుకు తహతహలాడసాగారు. వీరందరితోపాటు ద్వంద్వ నీతిపరులు సయితం తమ భయానక శత్రుత్వాన్ని దాచలేకపోతున్నారు. బహుదైవారాధకుల పరాజయం వల్ల ఇక తమ ఆటలు కొనసాగజాలవన్న భయం వారిని ఆక్రమించుకుంది.

### ఖైదీలు- నియమాలు

బద్ర్ పోరాటం తరువాత, యుద్ధంలో ప్రాణాలు దక్కించుకుని పారిపోయిన ఖురైష్ యోధుల్ని వెంటాడి వారిని పట్టుకునేందుకు చాలా కొద్ది మంది మాత్రమే ప్రయత్నించారు. వారు కొంత దూరం వెళ్ళి వారు కానరాకపోతే వెనుదిరిగారు. అలాంటి వారుకాక ముస్లిమ్ యోధులకు చేజిక్కిన యుద్ధ ఖైదీలను, యుద్ధంలో వశమయిన యుద్ధ ప్రాప్తిని తీసుకుని ముస్లిములు తిరుగు ప్రయాణం సాగించారు మదీనాకు. ఆ ఖైదీల పట్ల ఎలా వ్యవహరించాలో దైవాదేశంలో ఉన్న ప్రత్యామ్నాయాల పట్ల సంప్రతింపులు జరిపారు ప్రవక్తశ్రీ. ముహమ్మద్ సూరా (47: 4)లోని ఆదేశాల ప్రకారం కొన్ని ప్రత్యామ్నాయాలు ముందుకు వచ్చాయి :

1) యుద్ధం అసలు లక్ష్యం శత్రు శక్తిని పూర్తిగా తుదముట్టించడం. అలా శక్తిమేర ప్రయత్నించిన పిదప ఖైదీలను పట్టి బంధించవచ్చు.

2) యుద్ధంలో పట్టుబడిన సైనికుల్ని వారిపైన ఉపకార భావంతో వదలివేసినా లేదా పరిహారం స్వీకరించి వదలిపెట్టినా అది పాలనాధికారి లేదా ప్రభుత్వానికి వదలివేయటం జరిగింది. కొందరు ధర్మవేత్తల ప్రకారం, రణరంగంలో ఉన్నప్పుడే వారిని సంహరించే అవకాశం ముస్లిమ్ సేనకు ఉంటుంది, పట్టుబడిన తరువాత కేవలం అవసరమయిన, అనివార్యంగా ప్రత్యేక వినాయింపు గల పరిస్థితుల్లోనే వైరి సైనికుల హత్య న్యాయ సమ్మతమవుతుంది. ఆ నిర్ణయం కూడా, ఎవరిని హతమొందించాలో, ఎందుకో అన్న నిర్ణయం ఇస్లామీయ ప్రభుత్వమే గైకొనగలదు.

3) యుద్ధఖైదీల పట్ల సాధారణ ఆదేశమయితే వారిని ఉత్తమ రీతిలో వదలిపెట్టడం లేదా వారి నుండి పరిహారం గ్రహించి వదలివేయడం. 'ఉత్తమ రీతి' అన్న అంశంలో వారు ఖైదులో ఉన్నంతకాలం వారి ఎడల ఉత్తమరీతితో వ్యవహరించాలి, వారి అన్నపానీయాలు, చికిత్స ఇత్యాది విషయాల బాధ్యత ప్రభుత్వం పైనే ఉంటుంది. వారిని బాధపెట్టడం, అన్నపానీయాల పట్ల అశ్రద్ధ వహించడం ధర్మసమ్మతం కాదు. ఇంకా కొందరు

ముస్లిములకు వ్యక్తిగత నౌకరులుగా, ప్రభుత్వం అప్పజెప్పిన సేవలు అందజేసే సేవకులుగానూ వారిని వినియోగించుకోవచ్చు.

4) యుద్ధ ఖైదీలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడం ఇస్లామ్‌లో ధర్మసమ్మతం కాదు. అలాగే వారిని కట్టుబానిసల్లా సేవలు గ్రహించడం కూడా ధర్మసమ్మతం కాదు.

5) ఖైదీలు పరిహారం చెల్లించి విడుదల పొందే లేదా ఖైదీల మార్పిడి ద్వారా విడుదల జరిగే ఏ ఏర్పాటూ సంభవం కాకపోయిన పక్షంలో ముస్లిములకు అప్పజెప్పి, వారి ఎడల ఉత్తమ రీతిలో వ్యవహరించే షరతుతో, నియమానుసారం సేవలు గ్రహించవచ్చు లేదా బానిసలకు వర్తించే నిబంధన ప్రకారం పని చేయించుకోవచ్చు.

6) వారు ఇస్లామీయ రాజ్యంలో నివసించదలిస్తే వారికి స్వేచ్ఛ కల్పించి సాధారణ ముస్లిమ్ పౌరుల మాదిరిగా, స్వేచ్ఛనను భవిస్తూ జీవించేలా వదలవచ్చు.

❖ పరిహారం గ్రహించి వదలివేసే నియమం ప్రవక్తశ్రీ కాలంలో అదీ బద్ర్ ఖైదీల విషయంలోనే కానవస్తుంది. ఆ తరువాత యావత్తు చరిత్రలో అటువంటి ఉదాహరణ కానరాదు.

❖ ఏదయినా సేవకు బదులుగా విడుదల చేసే ఉదాహరణ కూడా బద్ర్ ఖైదీల విషయంలోనే దొరుకుతుంది. ఆ తరువాత అటువంటి దృష్టాంతాలు కానరావు. ప్రవక్త కాలంలో బద్ర్ ఖైదీలను, అన్సార్ బాలురిని విద్య నేర్పే, చదువు చెప్పే (చదవడం వ్రాయడం నేర్పే) సేవ చేయించుకుని వదలిపెట్టడం జరిగింది.

యుద్ధ ఖైదీల విషయంలో ఈ సవివరమయిన నియమాలు దివ్య కుర్‌ఆన్ "ముహమ్మద్" సూరా (47) ఆదేశాలననుసరించి సేకరించడం జరిగింది.

## యుద్ధప్రాప్తి

బద్ర్ మైదానంలో కురైష్ సేన వదలి పారిపోయిన సొత్తునంతా యుద్ధ ప్రాప్తిగా పరిగణించడం జరిగింది. దాన్ని దివ్య కుర్‌ఆన్ 'అన్‌ఫాల్'గా పేర్కొంది. 'నఫ్ల్' అన్న అరబీ ధాతువు ద్వారా ఏర్పడిన పదం 'అన్‌ఫాల్'. అంటే అదనపు, హక్కు కన్నా అధికం, చేరవలసిన దానికన్నా అధికం అని భావం. దాసుని పక్షాన అయితే విధి కన్నా అధికమయినది, ఇష్టపూర్వకంగా సమర్పించుకునేది అనీ, స్వామి పక్షాన అయితే స్వామి తన సేవకునికి అతని హక్కు కన్నా అధికంగా, అదనంగా ఇచ్చే బహుమానం లేదా కానుక అని అర్థం.

ఇస్లామ్‌కు పూర్వం యుద్ధాల్లో సిపాయిలు, యుద్ధం తరువాత తాము పరాజిత శత్రువు ద్వారా సేకరించినదంతా తామే, తమ స్వంత సొత్తుగా ఉంచుకునేవారు. ఆ విధానాన్ని అంతమొందించి యుద్ధప్రాప్తి అన్నది స్వామి సొత్తు అని పురమాయించడం జరిగింది :

> నిన్ను 'అన్ ఫాల్'ని గురించి అడుగుతున్నారు, వారికి చెప్పు, ఈ అన్‌ఫాల్ అయితే అల్లాహ్, ఆయన సందేశహరునికి చెందినవి. కనుక అల్లాహ్‌కు భయపడి మెలగండి, మీ పరస్పర సంబంధాలను మెరుగుపరచుకోండి. మీరు విశ్వాసులే అయితే అల్లాహ్, ఆయన సందేశహరునికి విధేయత పాటించండి. (అల్ అన్‌ఫాల్ 8: 1)

ఆ తరువాత దాని విభజనకు నియమం ఏర్పరచి యుద్ధంలో పాల్గొన్న సైనికుల్లో పంచివేయడం జరిగింది. ఆ నియమం ప్రకారం మొత్తం యుద్ధప్రాప్తిలో అయిదవ వంతు బైతుల్ మాల్ అంటే ప్రభుత్వ ధనాగారంలో, అల్లాహ్ వచన అభ్యున్నతికి, ధర్మ సంస్థాపనార్థం కేటాయించి మిగతా సైన్యంలో పంచివేయడం జరిగింది.

ఈ సందర్భంలో ఒక విషయం విశదీకరించడం అవసరం. యుద్ధ ప్రాప్తిని పొందే అభిలాష, శతాబ్దుల తరబడి ఏర్పడిన ఆచారం, అలవాటుననుసరించి, ప్రపంచాన్ని హేయంగా తలంచే ప్రవక్త సహచరుల్లోనూ అది బయటికి పొక్కింది. దాన్ని దూరం చేసి అటువంటి భావనలను సంస్కరించడానికి, ఇస్లామీయ శాసనాం గాన్ని అమలుపరచిన విధానాన్నే అనుసరించడం జరిగింది. మానవుల్లో పాదుకుపోయిన అలవాట్లను, దురాచారాలను రూపుమాపడానికి ఓ క్రమానుగతి విధానాన్ని ఇస్లామ్ ప్రవేశ పెట్టింది. యుద్ధప్రాప్తి విషయంలోనూ అదే జరిగింది. యుద్ధ ప్రాప్తిని గ్రహించడం ధర్మసమ్మతం చేసి, దాని విలువను పూర్తిగా పూజ్యం చేసి వేయటం జరిగింది. యుద్ధప్రాప్తి కొరకు పోరాడే వారికి పుణ్యఫలం ప్రాప్తం కాదని చెప్పి కేవలం దైవం కొరకు, ఎటువంటి ప్రపంచ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పోరాడేవారికి మాత్రమే పుణ్యఫలం దక్కుతుందని హెచ్చరించడం జరిగింది. ఆ తరువాత ఎవరయితే యుద్ధం తరువాత ప్రాపంచిక ప్రయోజనాన్నీ పొందుతారో వారి పరలోక ప్రయోజనం సన్నగిల్లుతుందని, ప్రపంచంలో ఎటువంటి ప్రయోజనాన్ని పొందని వారికి పరలోక ప్రయోజనం, పుణ్యఫలం పూర్తిగా లభిస్తుందన్న శుభ వార్తనివ్వడం జరిగింది.

ఈ శిక్షణ, బోధనల ఫలితంగా పరలోక సాఫల్యం, దాని కోరిక, దాని పట్ల ఆశలకు మనస్సుల్లో ప్రాధాన్యత ఏర్పడింది. ఆ పైన యుద్ధప్రాప్తిలో వారికి వారి వాటా ఇచ్చినా దాన్ని తిరస్కరించే మనస్తత్వం ముస్లిమ్ యోధుల్లో జనించింది. 'నేను దీని కోసం ఈ పోరాటంలో పాల్గొనలేదు' అన్న ధోరణి కనబరచడం సామాన్య మయిపోయింది.

## మరో కేంపేయిన్!

బద్ర్ పోరాటం ముస్లిములకు (అన్సారులయినా ముహాజిరు లయినా) తొలి అనుభవం, తొలి పరీక్ష కూడా. అది అత్యంత త్వరితకాలంలో, అత్యల్ప సంసిద్ధతతో చేసిన పోరాటం. రెండు మూడు గుర్రాలు, చాలీచాలని ఆయుధాలు, తమకన్నా మూడింతల అధిక సంఖ్యలో ఎదురయిన శత్రుగణంతో తలపడటం సాధారణ విషయం కాదు. దైవ సహాయం లేకపోతే ఆ విజయం సాధ్యమయ్యేది కాదు.

బద్ర్‌లో కలిగిన పరాభవ పూర్వకమయిన పరాజయం వల్ల తిరస్కారుల్లో ఎనలేని ప్రతీకార కాంక్ష పెల్లుబికింది. వారు ఈ సందర్భంలో ఇస్లామ్‌ను, ముస్లిములనూ కూకటివ్రేళ్ళతో పెకిలించి వేయాలని కంకణధారులయిపోయారు. ఈ మాట ముస్లిమ్ యోధులకు సయితం బాగా అవగతమయిపోయింది. శత్రువులు చేస్తున్న యత్నాల సమాచారం కూడా వారికి తెలియకపోలేదు. ఈ కారణంగానే దైవాదేశాలు సయితం తగినట్టు అవతరించాయి.

> మీరు, మీకు సాధ్యమయిన మేర, ఇతోధిక శక్తి గల, సదా సన్నద్ధత గల గుర్రాలు వారిని మార్కొనేందుకు సిద్ధపరచి ఉంచగలరు. వీటి ద్వారా, అల్లాహ్‌కూ, మీకూ శత్రువుల యిన వారినీ ఇతర వైరులనూ భయపెట్టడానికి, వారిని మీరెరుగరు, కాని అల్లాహ్‌కు తెలుసు. దైవమార్గంలో మీరు ఖర్చుపెట్టే దానికంతటికీ పరిపూర్ణంగా తిరిగి మీకు ఇవ్వబడు తుంది, మీ పట్ల ఏ మాత్రం అన్యాయం జరగదు.
>
> (అన్‌ఫాల్: 8: 60)

అంటే ఇస్లామీయ రాజ్యం వద్ద యుద్ధసామగ్రితోపాటు సర్వసన్నద్ధ మయిన సుస్థిర సైన్యం నిత్యం సిద్ధమయి ఉండాలి అన్నమాట. అయితే ముస్లిములు తమ అంగబలం మీద, ఆయుధ బలం మీద భరోసా పెట్టుకోరాదు, ఎంతసేపటికీ వారికి తమ ప్రభువు సహాయం, తోడ్పాటు మీదనే నమ్మకముండాలి. ఇదే మీ నిజమయిన బలం, మీ ఆయుధం. అల్ అన్‌ఫాల్ సూరా 65-66 ఆయత్‌లలో ఈ మాటే ముస్లిముల హృదయాల్లో నాటే ప్రయత్నం జరిగింది. ఇదే ముస్లిముల నైతిక బలిమి (Morale). తన ఆశయం పట్ల సరయిన అవగాహన, నిజమయిన స్పృహ గల సముదాయంలోని ప్రతి వ్యక్తిలో ఈ శక్తియే తన ప్రాణాన్నయినా త్యజించే ఉత్తేజాన్ని, శక్తిని జనింపజేస్తుంది.

మదీనా చుట్టుపట్లనున్న యూదులతో ప్రాచీన కాలం నుంచి ఔస్, ఖజ్‌రజ్ తెగల ఒప్పంద సంబంధాలున్నాయి. యూదులకు ఇస్లామీయ యోధుల బద్ర్ విజయం ఏమాత్రం నచ్చలేదు. వారు వివిధ రీతుల్లో ఇస్లామ్‌ను దుష్ప్రచారాలకు గురి చెయ్యసాగారు. వారు తమ్ముతాము దేవుని అనుంగు సంతానంగా ప్రకటించు కునే వారు. ఈ కారణంగా ముస్లిములకు వ్యతిరేకంగా, సత్యానికి విరోధంలో అంధులయిపోయి తమ పూర్వ సంబంధాలను సయితం ఖాతరు చేయక, ప్రవక్త(శ్రీ) మదీనా నగరానికి రాగానే చేసుకున్న ఒడంబడికల్ని సయితం తుడిచిపెడుతూ ముస్లిముల ఎడల తమ దౌష్ట్యాన్ని ప్రదర్శించసాగారు.

క్రమేణ వారి దుశ్చేష్టలు ఏ స్థాయికి దిగాయంటే, ఓ రోజు బనీ కైనుకా తెగ వారి బజారులో ఏదో పని మీద వచ్చిన ఓ ముస్లిమ్ స్త్రీని వివస్త్ర చేశారు దుండగులు. దాని మీద పెద్ద తగువు జరిగి ఆ హంగామాలో ఒక ముస్లిమ్, ఒక యూదు వ్యక్తి హతమ య్యారు. ప్రవక్త(శ్రీ)(స) స్వయాన ఆ వీధికి వెళ్ళి అందరినీ సమావేశ పరచి సమాధానపరచడానికి ప్రయత్నించారు. దానికి బదులుగా యూదులు బెదిరించారు.

“ముహమ్మద్! మమ్మల్ని బహుశా కురైష్ లాంటి వాళ్ళను కున్నావేమో, వారికి పోరాడటం అంటే ఏమిటో తెలీదు, నీవు వారిని ఓడించావు. మాతో తలపడితే గాని తెలియదు. మగవాళ్ళని ఎవరినంటారో!”

## క్షమాభిక్ష

ఇది మరో మాటలో యుద్ధ ప్రకటన! గత్యంతరం లేక ప్రవక్త మహనీయులు, కడకు తన సహచరులతో కలసి ఆ వీధిని చుట్టు ముట్టారు. ఆ దిగ్బంధం 15 రోజులు సాగింది. అంతే, బనీ కైనుకా తమ ఆయుధాలు పడవేశారు, ప్రవక్త(శ్రీ)(స) ఆదేశానుసారం వారిలోని యుద్ధ సామర్థ్యమున్న వారినందరినీ బంధించడం జరిగింది. ఆ సందర్భంలో ద్వంద్వ నీతిపరుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై వారికి కుమ్మక్కుగా వచ్చి వారిని క్షమించి వెయ్యవలసిందని ప్రవక్త(శ్రీ)(స) మీద ఒత్తిడి తెచ్చారు. ప్రవక్త మహనీయులు అతని అభ్యర్థనను మన్నించి మహనీయ ఉబాదా బిన్ సామిత్‌ని మధ్యవర్తిగా నియమించి ఆయన నిర్ణయా నికే వదలివేశారు, ఎందుకంటే బనీ కైనుకా ప్రజలు మహనీయ ఉబాదా తెగకు ఒడంబడిక దారులు. ఆయన నిర్ణయం మేరకు, బనీ కైనుకా తమ సర్వస్వం, ఆయుధాలు, పనిముట్లు అంతా వదలి మదీనా నుండి దూరంగా వెళ్ళిపోవాలని తీర్పు జరిగింది.


***ఆధారం :*** *1) సీరతున్నబీ కామిల్ : సం.1; పు.739-751*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3; పు.137-162*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.6; పు.30-33; 45-62*

17వ పేజీ తరువాయి...

నాలో గౌరవం మరింత పెరిగింది. ఆ తరువాత నమాజ్ మొదలయింది. ముస్లిములు ఒకే వరుసలో భుజం భుజం కలిపి నిలబడ్డారు. అప్పుడు నాకు వారు దైవదూతలుగా కనబడ్డారు. వారి ముందు దేవుడు తెరచాటు లేకుండా ప్రత్యక్షం అయ్యాడని పించింది. దేవుడు బనీఇస్రాయీల్‌తో రెండు సార్లే సంభాషించాడు. కాని ఈ జాతితో ప్రతిరోజూ మాట్లాడతాడేమో అనిపించింది."

నమాజ్‌కు ఉన్న ఔన్నత్యం ఏమిటంటే నమాజ్ చేయించడానికి ఇమామ్ అయి ఉండాలనే నిబంధన ఏమీలేదు. మస్జిద్‌లోనే నమాజ్ చేయాలనే నియమమూ లేదు. ఎవరయినా నమాజ్ చేయించే ఇమామ్ కావచ్చు. స్వచ్ఛమయిన ఏ స్థలమయినా మస్జిద్ అవుతుంది. ఎలాంటి తారతమ్యం, నిమ్నోన్నతలు లేకుండా అందరూ ఒకే వరుసలో నిలబడి నమాజ్ చేస్తారు. నమాజ్ ఎంతటి ప్రభావవంతమయినదంటే, ఎంతటి వివక్షపరుడైనా, ఇస్లామ్ శత్రువయినా నమాజ్ గురించి ప్రశంసించకుండా ఉండలేడు. కనబడని దైవాన్ని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం చూస్తే రాతి హృదయం కూడా కరిగిపోతుంది.

ఫాదర్ లేఫ్రాయ్ తన పుస్తకం "Mankind And Church"లో ఇలా వ్రాశాడు :

"ముస్లిములు నమాజ్ చేసే విధానం చూసిన ఏ వ్యక్తీ దాని నుంచి ప్రభావితం కాకుండా ఉండలేడు. ముస్లిమ్ ఎక్కడున్నా, రోడ్డు మీద నడుస్తున్నా, రైల్వేస్టేషన్‌లో ఉన్నా, దుకాణంలో కూర్చుని ఉన్నా, మైదానంలో పచార్లు కొడుతున్నా అజాన్ అవగానే అన్నీ వదిలిపెడతాడు. ఒకే ఒక్కడైన దైవం ముందు తలవంచుతాడు. ముఖ్యంగా ఢిల్లీలోని జామియా మస్జిద్‌లో అల్‌విదా రోజు పదిహేను, ఇరవై వేల మంది ముస్లిములు అత్యంత భక్తిశ్రద్ధలతో దైవారాధన చేయడం చూసిన ప్రతి ఒక్కరూ ప్రభావితం కావాల్సిందే. ఆ మత వ్యవస్థలో పనిచేస్తున్న బలమైన శక్తిని వారి మనస్సులు గ్రహిస్తాయి. అంతేకాకుండా ముస్లిము ప్రతిరోజు ఐదు పూటలు అత్యంత బిజీ వేళల్లో భక్తిశ్రద్ధలతో ఎంతో ప్రశాంతంగా నమాజ్ చేసి తమ విధిని నెరవేర్చడం ఒక సందేశాన్నిస్తుంది.

## ముస్లిముల జీవితాలపై ఇస్లామీయ బోధనల ప్రభావం

విశ్వాసాలు, ఆరాధనల తరువాత ఇస్లామ్ వ్యాప్తిలో ప్రధాన పాత్ర పోషించే కీలకాంశం ముస్లిముల ఇస్లామీయ జీవితం. ఇస్లామ్ ధర్మం కేవలం నియమాల వరకే పరిమితమయినట్లయితే దాని బోధనల ప్రభావం అంతగా ఉండేది కాదు. కాని ఇస్లామీయ బోధనలు ఎన్నో జాతుల తలరాతను మార్చింది. అనాగరిక జాతులను మనవత శిఖరాగ్రానికి చేర్చింది. ఎందుకంటే అది నియమాలతోపాటు ఏం చేయాలో కూడా చెప్పింది. అందుకే అది అందరినీ తన వైపు అయస్కాంతశక్తిలా ఆకర్షిస్తోంది.

దైవ ఏకత్వం, ఆయన ఘనత, సహాయం చేయాలన్నా, శిక్ష విధించాలన్నా అల్లాహ్‌యేనన్న ఇస్లామీయ బోధనలు ముస్లిముల్లో ఎంతగా ఆత్మాభిమానాన్ని, సహనాన్ని, కృతజ్ఞతా భావాన్ని, స్థిరత్వాన్ని నింపాయంటే వారు ప్రపంచంలో దేనికీ భయపడరు. ఎవరి ముందూ చేయి చాచరు. ఎంత పెద్ద ఆపద వచ్చిపడినా నిరాశ చెందరు. శిక్షా బహుమానాలు, పరలోకానికి సంబంధించి ఇస్లామ్ బోధనలు వారిలో ఎంత ధైర్యాన్ని, సౌఖ్యాన్ని పెంపొందించాయంటే వారు ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికమని భావిస్తారు. అన్ని వేళలా ఆ దైవం కోసం ఎలాంటి త్యాగం చేయడానికైనా సిద్ధపడ తారు. ఇస్లామీయ బోధనలు వారిలో అసాధారణ ధర్మ పరాయణతను పెంపొందించాయి. మద్యం, చౌర్యం, నైతిక నేరాల నుంచి వారు దూరంగా ఉండసాగారు. మానవ సమానత్వం, సోదరభావానికి సంబంధించి ఇస్లామీయ బోధనలు వారిలో ఎలాంటి ప్రజాస్వామ్య జీవాన్ని పోసాయంటే వారు జాతి వివక్ష, వర్ణ, వర్గ భేదాలు చూపరు. ఇస్లామ్ స్వీకరించిన తరువాత అందరూ సరిసమానులే. ధనిక, పేద, యజమాని, నౌకరు అందరూ పరస్పరం సోదరుల్లాంటి వారయిపోతారు.

ముస్లిముల జీవితంలో ఇస్లామీయ బోధనల ప్రాధాన్యత కూడా ఎనలేనిది. ఇస్లామీయ బోధనల ప్రభావం వల్ల అనాగరిక జాతులు కూడా రుజుమార్గంలో నడవసాగాయి. యూరప్‌లోని క్రైస్తవ ప్రచారకులు అది చూసి, ఆఫ్రికా ఆటవిక జాతులు సయితం ఇస్లామ్ బోధనలలో సంస్కారవంతులవుతున్నారే అని ఆశ్చర్య పోసాగారు. ఇస్లామీయ బోధనల్లో ఉన్న ఘనత అలాంటిది.







**మనిషిలో** సిగ్గు అనే సుగుణం లేకపోయినట్లయితే మనసు ఏది కోరితే అది చేస్తాడు. సిగ్గుమాలిన మనిషిపై ఎలాంటి శుభాలు అవతరించబడవు అని చెప్పటం జరిగింది. 'సిగ్గు ఆపాద మస్తకం మేళ్ళతో నిండి ఉంది. సిగ్గు విశ్వాసంలోని ఒక భాగం' అని సెలవిచ్చారు దైవప్రవక్త(స). సిగ్గు ద్వారా విశ్వాసి దైవాజ్ఞలకు కట్టుబడి ఉంటాడు. అవిశ్వాస వైఖరి నుంచి తనను తాను కాపాడుకుంటాడు. సిగ్గు బిడియాలు, భయభక్తులు లేని విశ్వాసం ప్రాణం లేని శరీరం వంటిది. అయితే ఈ సిగ్గూ బిడియాల పరిస్థితి అనేక విధాలుగా ఉంటుంది. 1) అల్లాహ్ పట్ల సిగ్గు 2) తోటి వారి పట్ల బిడియం 3) దైవదూతల పట్ల సిగ్గు 4) తన ఆత్మ పట్ల సిగ్గు

### అల్లాహ్ పట్ల సిగ్గూ బిడియాలు

అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించటం, పాపకార్యాలను చెయ్యటం అల్లాహ్ పట్ల సిగ్గూ బిడియాలు లేకపోవటాన్ని సూచిస్తుంది. ఈ విషయాన్ని అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథం ద్వారా ఇలా తెలియజేశాడు. ఏమిటి? అల్లాహ్ చూస్తున్నాడనే విషయం అతనికి తెలియదా? (96: 14) అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. (4: 1)

అల్లాహ్ పట్ల సిగ్గు అంటే మనిషి దైవాజ్ఞలను శిరసావహించాలి. దేవుడు నిరోధించే కార్యాలను విడనాడాలి. దైవప్రవక్త(స) ఒకసారి ఇలా సెలవిచ్చారు : అల్లాహ్ పట్ల సిగ్గూ బిడియాలను కలిగి వుండండి. ఏ విధంగానైతే ఆయన పట్ల సిగ్గూ బిడియాలు కలిగి ఉండాలో ఆవిధంగా. దానికి ఆయన (స) గారి అనుచరులు, ఓ దైవప్రవక్తా(స)! అల్‌హమ్దులిల్లాహ్! మేము అల్లాహ్ పట్ల సిగ్గూ బిడియాలను కలిగి వుంటున్నాము అని విన్నవించుకున్నారు. దానికి ఆయన (స) ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ పట్ల పరిపూర్ణమైన సిగ్గూ బిడియాలను కలిగి ఉండటం అంటే మనిషి తన తల మరియు అందులో ఉన్న వాటినన్నింటి నుంచి రక్షణ పొందాలి. ఇంకా కడుపు, అందులో ఉన్న వాటినన్నింటి నుంచి రక్షణ పొందాలి. ఇంకా మరణం తప్పకుండా వస్తుందనే విషయాన్ని, ఈ లోకం ఎప్పుడో ఒకప్పుడు నశిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇంకా పరలోక సాఫల్యం కొరకు ఇహలోకపు ఆకర్షణలను ప్రేమించడం మానుకోవాలి. ఎవడైతే ఈ విషయాలను అవలంబిస్తాడో అతను అల్లాహ్ పట్ల సిగ్గూ బిడియాలను అవలంబిస్తున్నాడన్న మాట (తిర్మిజి).

దీని ద్వారా తెలిసిన విషయమేమిటంటే మనిషి తన మనసు, కళ్ళు, చెవులు, నోరు చేసే ఆచరణలపై నిఘా ఉంచాలి. దేవుడు ఇష్టపడే విషయాలనే ఆలోచించాలి. సత్కార్యాలనే దృష్టిలో ఉంచుకోవాలి. దేవునికి ఇష్టమైన మాటలనే పలకాలి. మంచి

విషయాలనే వినాలి. అశ్లీల మాటలను, అశ్లీల పాటలను వినకుండా ఉండాలి. మంచి విషయాలనే చూడాలి. అశ్లీల విషయాలను, అశ్లీల చిత్రాలను చూడకుండా ఉండాలి. ఎందుకంటే మనిషి ఎవరి కంటా పడకుండా చేసే పనులను కూడా అల్లాహ్ చూడగలడు అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. నల్లని రాత్రి నల్లని బండపై నల్లని చీమ నడుస్తూ పోతూ ఉంటే దాన్ని కూడా అల్లాహ్ చూడగలడు. దాని పాదాల సవ్వడిని కూడా వినగలడు. అల్లాహ్ సూక్ష్మగ్రాహి కాబట్టి ఆయన్ని తప్పించుకోవటం అసంభవం. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: మేము మానవుణ్ణి సృష్టించాము. అతని మనసులో మెదిలే ఊహలను సైతం మేము ఎరుగుదుము. మేము అతని కంఠనాళం కంటే కూడా అతనికి చాలా దగ్గరగా ఉన్నాము. (50: 16) అల్లాహ్ పట్ల సిగ్గూ బిడియాలు కల మనిషి పగటి వెలుగులో చెయ్యలేని పనులను రాత్రి చీకటిలో కూడా చెయ్యడు. నలుగురి ముందు బహిర్గతం చెయ్యలేని విషయాలను మనసులో కూడా ఆలోచించడు. ఎల్లప్పుడూ తాను అల్లాహ్ పర్యవేక్షణలో ఉన్నానని అత్యంత జాగరూకతతో మసలుకుంటూ ఉంటాడు.

### తోటివారి పట్ల సిగ్గూ బిడియాలు

మనిషి తోటి మనిషి ముందు కూడా సిగ్గుతో పద్ధతి ప్రకారం ఉండటం కూడా చాలా అవసరం. సాధారణంగా మనిషి స్వభావంలో సిగ్గు ఉన్న కారణంగానే తమ శరీరాన్ని కప్పుకోవటానికి వస్త్రాలు ధరిస్తాడు. వస్త్రాలు మనిషి సిగ్గుపడే శరీర భాగాలను కప్పుతాయి. అందాన్నిస్తాయి. ప్రపంచ ప్రాణులన్నింటిలో కేవలం మనిషికి మాత్రమే సిగ్గుపడే స్వభావం ఉంది. ఇంకా వస్త్రాలను ధరించే అవసరమూ ఉంది. ఇది దైవకారుణ్యం. ఈ వస్త్రాల ద్వారా మనిషి తనను తాను అలంకరించుకుంటాడు. అందంగానూ, హుందాగాను కనిపిస్తాడు. తాను కోరినన్ని రకాల వస్త్రాలు ధరిస్తాడు. రోజుకొకటి మారుస్తాడు. ఒకవేళ ఇతర జీవుల మాదిరిగా వస్త్రాల అవసరం లేని ఏదో ఒక రకమైన తోలుతో అల్లాహ్ మనిషినీ పుట్టించినట్లయితే ఎలా ఉండేది. మనిషి మనసు ఈ విషయాన్ని ఊహించటాన్ని కూడా ఇష్టపడదు. ఎందుకంటే కరుణామయుడైన అల్లాహ్ మనిషికి అందమైన శరీరాన్ని, ఆ శరీరానికి మరింత అందాన్ని ఇనుమడింపజేసే వస్త్రాలను ప్రసాదించాడు. అయితే ధరించే ఆ వస్త్రాలు ఏవిధంగా ఉండాలో కూడా తెలియజేశాడు. మనిషి తోటి మనిషి ముందు సిగ్గు పడటం సహజం. మనిషిలో ఉండే ఈ సుగుణం అతన్ని ఉన్నతుడుగా, గౌరవ ప్రదుడుగా తీర్చిదిద్దుతుంది. కాని షైతాన్‌కు ఈ విషయం గిట్టదు. తనకు లభించని గౌరవం మనిషికి లభించకూడదని అతను భావిస్తాడు. కనుక మొట్ట మొదట గౌరవాన్ని ప్రసాదించే వస్త్రాలను మనిషి శరీరంపై నుంచి తొలగించాలని భావిస్తాడు. అతడి పన్నాగ ప్రభావం మనం ఈనాడు మన సమాజంలో చూస్తూ ఉన్నాము. మనిషి ముందు సిగ్గు పడే మనిషి బహిరంగంగా అర్ధనగ్న ప్రదర్శనలిస్తున్నాడు. ఈ విషయంలో అందరికంటే ఎక్కువగా సిగ్గుపడే స్త్రీ జాతి ముందుంది అంటే అది అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు.

### దైవదూతల పట్ల సిగ్గు బిడియాలు

కరుణామయుడైన అల్లాహ్ మనుషుల రక్షణ కోసం, మనుషుల ఆచరణలను వ్రాయటం కోసం, మనుషుల ఆదరణలను అల్లాహ్ ముందు ప్రస్తావించటం కోసం ఇంకా మనుషుల దైవ కారుణ్యాలను అవతరింపజెయ్యటం కోసం ఎల్లప్పుడూ దైవదూతలు మనుషులతో పాటు ఉండేలా ఏర్పాటు చేశాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: విద్యనభ్యసించేవారి సంతోషం కోసం దైవదూతలు తమ రెక్కలను పరుస్తారు. (అబూదావూద్) ఇంకా దైవ నామస్మరణ జరిగే సభలలో కూడా దైవదూతలు హాజరవుతారు. ఇటువంటి సభల కోసం వారు వెతుకుతూ ఉంటారు. ఎక్కడైతే ఇలాంటి సభలు జరుగుతూ ఉంటాయో అక్కడ వారు చేరుకుని ఒకరినొకరు పిలుచుకుంటారు. అందులో హాజరవుతారు. అంతేకాదు అల్లాహ్ ముందు వారిని గురించి ప్రస్తావిస్తారు అని కూడా చెప్పటం జరిగింది. ఇంకా వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించినట్లయితే డెబ్బై వేల దైవదూతల పరామర్శించిన వ్యక్తి కోసం దుఆ చేస్తారు అని చెప్పటం జరిగింది. ఇంకా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఎప్పుడూ పూర్తిగా నగ్నంగా ఉండకండి. ఎందుకంటే దైవదూతలు ఎల్లప్పుడూ మీతోపాటు ఉంటారు. రెండు సమయాలలో తప్ప- ఒకటి, మీరు కాలకృత్యాలు తీర్చుకునేటప్పుడు. రెండు, మీ భార్యలతో కలిసేటప్పుడు. కనుక మీరు దైవదూతల పట్ల సిగ్గుతో వ్యవహరించండి. వారిని గౌరవించండి. ఈ విధంగా ఎల్లప్పుడూ దైవదూతలు తోడుగా ఉన్నప్పుడు మనిషి సిగ్గుమాలిన పనులు ఎలా చెయ్యగలడు. కనుక అత్యంత జాగరూకతతో, సిగ్గుతో వ్యవహరించవలసి ఉంటుంది..

### ఆత్మ పట్ల సిగ్గూ బిడియాలు

మనిషి ఒంటరిగా ఏకాంతంలో ఉన్నప్పుడు షైతాన్ ప్రలోభానికి గురిచేస్తాడు. అశ్లీల కార్యాలు చెయ్యమని ఉసిగొలుపుతాడు.

మిగతా 27వ పేజీలో...

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

# మానవత... నైతికత...

**విశ్వ ప్రభువు** అల్లాహ్, విశ్వ జనావళి కోసం సమ్మతించి, ఆమోదించిన జీవన సంవిధానం ఇస్లాం ధర్మం. ఇస్లామ్ ధార్మిక పరిమళాలు విశ్వమంతటా వ్యాపించాయి. ఇస్లాం మనిషికి మానవునిగా ఉన్నతమైన హోదాను ఇచ్చింది, ప్రజలు ఏ ప్రాంతానికి చెందినవారైనా, ఏ భాష మాట్లాడేవారైనా, ఏ రూపు రంగు కలవారైనా అంతా ఆది మానవుడి సంతానమే, పరస్పరం సొదరులే, ఒక్కడైన దేవుని దాసులే.

### ఇస్లాం ముఖ్య లక్షణాలు

చట్టం పట్ల గౌరవం, దేవుని పట్ల ప్రేమ, ఆశ, భయాన్ని ప్రజల హృదయాలలో నింపాలన్నదే ఇస్లాం ప్రబోధనం. ప్రతి వ్యక్తి తనతో ఇతరులు ఎలా వ్యవహరించాలని కోరుకుంటాడో ఇతరులతో తానూ కూడా అలానే వ్యవహరించాలి. ఇటుకకు రాయితో సమాధానం చెప్పే పద్ధతిని కొందరు సృష్టించుకున్నారు, కానీ ఇస్లాం స్థాపించగోరే పవిత్ర సమాజానికి ఉదాహరణ ఏ మానవ సిద్ధాంతంలోనూ కనబడదు. మనిషి సంఘ జీవనంలో చెడును మంచి ద్వారా, కాఠిన్యాన్ని కరుణ ద్వారా, పిసినారితనాన్ని ఔదార్యం, దానధర్మాల ద్వారా, వైరాన్ని, ద్వేషాన్ని ప్రేమ ద్వారా, దౌర్జన్యాన్ని క్షమ ద్వారా నిర్మూలించాలని కోరుకుంటుంది.

ఇస్లాం ధర్మం అజ్ఞానాన్ని తొలగించి మానవ హృదయాలలో విద్య, అభ్యాస స్ఫూర్తిని నింపుతుంది.

నేటి అభివృద్ధిలో ముస్లింలు విద్యాపరంగా వెనుకబాటుతో పాటు నైతిక అధోగతికి గురై ఉండటం శోచనీయం. సైన్స్ పునాదులు, సూత్రాలు ఇస్లాం ధర్మానికి రుణపడి ఉన్నాయి అన్న మాట నిర్వివాదాంశం, నేటి శాస్త్రవేత్తలు పరిశోధన, పరిశీలన ద్వారా అందిస్తున్న వాస్తవాలను ఇస్లాం పద్నాలుగు వందల సంవత్సరాల క్రితమే వివరించింది. నేడు సైన్స్ ఎంతగా అభివృద్ధి చెందుతోందో అంతే వేగంగా ఇస్లాం సత్యత కూడా వెలుగులోకి వస్తున్నది.

గత చరిత్ర వైభవాన్ని చూసినట్లయితే, ప్రియప్రవక్త(స) వారి అనుచరులు- వారు అడుగుపెట్టిన ప్రతి ప్రాంతాన్ని బాహ్య, అంతర్లీన శాంతి, శుభాలతో సుసంపన్నం చేశారు.

కేవలం స్పెయిన్ చరిత్రను అధ్యయనం చేస్తే చాలు, మధ్య యుగాలలో, యూరప్ కటిక చీకటిలో మునిగిపోయినప్పుడు, సంస్కృతీ నాగరికతకు, సంస్కారం, మర్యాదకు దూరంగా అడవులు, గుడిసెలలో నివసించారని చరిత్రకారులు చెప్పారు. నాగరికత కాదు కదా నాగరికత యొక్క గాలిని కూడా వారు అనుభవించలేదు అన్నారు.

ఈ చీకటి యుగంలో, ముస్లింలు కేవలం తొంభై సంవత్సరాలలో పవిత్ర ఖురాన్ జ్యోతిని సమర్కంద్ నుండి అట్లాస్ తీరానికి, నల్ల సముద్రం నుండి ముల్తాన్ వరకు తీసుకెళ్ళి సైన్స్, కళల కేంద్రాలను స్థాపించారు. ఆకాశంతో మాట్లాడే అద్భుతమైన మస్జిదులను నిర్మించారు. ఎత్తైన మినార్లు, కళాశాలలు, లైబ్రరీలు, ఆసుపత్రులు, భవనాలు, రాజభవనాలు, దృఢమైన కోటలు,

ఉద్యానవనాలు, వంతెనలు, చెరువులు మరియు ప్రజా సంక్షేమ సంస్థలను స్థాపించడం ద్వారా, ప్రపంచ ప్రజలు మరింత పరిశోధనాత్మక శాస్త్రాలపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు, ప్రేరణగా నిలిచారు.

స్పెయిన్లో ముస్లింలు అనేక ఓడరేవులను నిర్మించారు. స్పెయిన్‌కు చెందిన ఇబ్న్ ఫెర్మాస్ అనే ముస్లిం శాస్త్రవేత్త మూడు విషయాలను కనిపెట్టి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడని విల్ డురాన్ అనే చరిత్రకారుడు అంగీకరించాడు.

1) కళ్ళద్దంలోని అద్దం (2) సమయం చెప్పడానికి గడియారం (3) గాలిలో ఎగిరే యంత్రం అంటే విమానం.

ముస్లింలు కూడా నాడు ముస్లిం పరిపాలన క్రింద ఉన్న స్పెయిన్లో ప్రెస్‌ను కనుగొన్నారు, ఇవన్నీ చరిత్ర పట్టిక నుండి చెరిపివేయబడని వాస్తవాలు. ముస్లింల వద్ద సైన్స్, నూతన ఆవిష్కరణలో ఈ నైపుణ్యాలు ఉన్నంత కాలం, ప్రపంచంలో శాంతి, న్యాయం , సుభిక్షం ఉన్నాయి. ఈ శాస్త్రాలు అనాగరికుల వద్దకు వెళ్లాయి, ప్రపంచంలో శాంతి అందని ద్రాక్ష అయ్యింది. క్రూరత్వం, రక్తపాతం సాధారణమై పోయింది. మానవత, నైతిక విలువలు మచ్చుకు కూడా కనిపించకుండా పోయాయి.

### గౌరవప్రదమైన భవిష్యత్తు కోసం అన్వేషణ

నేటి యుగం ముస్లింలు విద్య, పరిశోధన రంగంలో ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ధర్మాన్ని , విశ్వాసాన్ని కాపాడుకుంటూ శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందడుగు వేయాల్సి ఉంది. నేడు, కొంతమంది మత మౌఢ్యం గల మూకలు ద్వేషం, విభేదాలు, మతకలహాలను రెచ్చగొట్టడంలో బిజీగా ఉన్నారు. దేశంలోని సాధారణ ప్రజల్ని సయితం రెచ్చగొట్టడం, తద్వారా వారు కూడా విద్రోహానికి కారకులయ్యేలా కుట్రలు పన్నుతున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా, ప్రతి ఒక్కరు వారికి నచ్చిన మతాన్ని అనుసరిస్తూనే ఉన్నతమైన నైతిక, ఆదర్శవంతమైన మానవత, స్వచ్ఛమైన స్వభావాన్ని కలిగి ఉండాలి. విశ్వ శాంతికి మత ధర్మం చెప్పే మూల సూత్రాలను చిత్తశుద్ధితో అమలు పరచాలి.

25వ పేజీ తరువాయి...

ఇక్కడ, ఇప్పుడు ఎవ్వరూ చూడటంలేదని నమ్మబలుకుతాడు. నలుగురిలో బహిరంగంగా చెయ్యలేని విషయాలను అత్యంత ఆకర్షణీయంగా చిత్రీకరించి చూపిస్తాడు. కాని ఇది చెడు, చెయ్యకు. ఎవ్వరూ చూడకపోయినా దేవుడు చూస్తున్నాడని అంతరాత్మ ఘోషిస్తుంది. ఆత్మ, అంతరాత్మల మధ్య ఘర్షణ జరుగుతుంది. కాని సిగ్గూ బిడియాలు, భయభక్తులు, మరణం తరుముకొస్తుంది. దేవుని ముందు హాజరు కావలసి ఉంది అనే విషయాలు గనక మనిషి హృదయంలో నాటుకుపోయి ఉన్నట్లయితే అతను షైతాన్ ప్రేరణలకు లొంగడు. పైగా ఓ అల్లాహ్! నన్ను ఈ సమయంలో షైతాన్ ప్రేరేపిస్తున్నాడు. దుష్టుడు, దుర్మార్గుడు, శత్రువు అయిన ఇతడి బారి నుండి రక్షించు అని ప్రార్థిస్తాడు. దైవ సహాయాన్ని పొందుతాడు. అతడి పన్నాగం నుండి తప్పించుకుంటాడు. షైతాన్ పన్నాగాన్నుంచి తప్పించుకోవాలంటే ఏకాంతంలో ఉన్నప్పుడు వుజూతో ఉండటం దైవారాధనలో గడపటం అత్యంత శ్రేయస్కరమైన విషయం. ఈ విధంగా మనిషిలో సిగ్గూ బిడియాలు గనక ఉన్నట్లయితే అతని వద్ద దుష్కార్యాల నుంచి తప్పించుకునే ఒక గొప్ప ఆయుధం ఉన్నట్టే.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




# ప్రేమను పంచండి

**పరస్పర సంబంధాలు** సవ్యంగా లేని కారణంగా మనిషి మానసిక అనారోగ్యానికి గురవుతున్నప్పుడు దానికి చికిత్సతోపాటు పత్యం చెయ్యటం కూడా చాలా అవసరముంటుంది. చికిత్స ఏమిటంటే మనిషి తన మనసులో కొన్ని సద్గుణాలను అభివృద్ధి పరచాలి. పత్యం ఏమిటంటే, మనిషి తన మనసులో ఉన్న దుర్గుణాలను విడనాడాలి. కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్ (స) అజ్ఞాన కాలంలో అరబ్బుల హృదయాలలో ముదిరిపోయి ఉన్న ఈ వ్యాధికి చికిత్స చేశారు. వారితో పత్యమూ చేయించారు. దాని కారణంగా వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తమ జీవితాలను గడిపారు.

మొట్టమొదట కావలసిన సద్గుణం ఏమిటంటే, మనిషి హృదయం మృదువైనదిగా ఉండాలి. భూమి గట్టిగా, బంజరుగా ఉన్నట్లయితే అందులో మొక్కలూ మొలకెత్తవు, పండ్లూ కాయలు కాయవు. రైతు భూమిని దున్ని మెత్తగా చేసి అందులో విత్తనాలు చల్లినట్ల యితే మంచి మొక్కలు మొలకెత్తుతాయి. తియ్యని పండ్లు కాస్తాయి; అందమైన పూలు పూస్తాయి. అదేవిధంగా మనిషి హృదయం మృదువైనదిగా ఉన్నట్లయితే అందులో సద్గుణాల మొక్కలు మొలకెత్తుతాయి. ప్రేమానురాగాల పండ్లూ కాస్తాయి; త్యాగం, దయ, సానుభూతి లాంటి అందమైన పూలు పూస్తాయి. దాని కారణంగా తోటి మానవులతో సత్సంబంధాలు ఏర్పడ తాయి. అప్పుడు అతను సుఖంగా సంతోషంగా ఉండగలుగు తాడు. ఒకవేళ హృదయం కఠినంగా ఉన్నట్లయితే అతని చుట్టూ ధనం, వెండి, బంగారాలు, హోదాలు, అంతస్తులు, మేడలు, మిద్దెలు ఉండవచ్చు కాని ప్రేమామృతాలను పంచే తోటి మనుషులు కరువైపోతారు. అలాంటప్పుడు అతను మానసిక అనారోగ్యానికి గురికాక తప్పదు. కారుణ్యమూర్తి మహాప్రవక్త(స) గారి ఒక ప్రత్యేక సుగుణం మృదు స్వభావం. ఆయన(స) గారి మృదుత్వం కారణంగా ప్రజలు తండోపతండాలుగా ఆయన గారికి చేరువయ్యారు. ఒక్కసారి చేరువైన మనిషి జీవితాంతం ఆయన స్నేహితాన్ని విడనాడ లేదు.

మనుషుల మధ్య పొరపొచ్చాలు రావటం, విభేదాలు తలెత్తటం సహజం. అటువంటప్పుడు జరిగిన తప్పును ఒకరిపై ఒకరు వేసుకోవటం జరుగుతుంది. స్వయంగా తనది తప్పు అయినప్ప టికీ అంగీకరించటానికి మనసు ఒప్పదు. దాని కారణంగానే కలహాలు జరుగుతాయి. కోపోద్రేకాలు కట్టలు తెంచుకుంటాయి. అటువంటప్పుడు తప్పు తనది కాకపోయినా క్షమించమని కోరటం వలన, తప్పు ఎదుటి వారిది అయినప్పుడు క్షమించి వేయటం వలన ప్రశాంతత చేకూరుతుంది. దైవప్రవక్త(స) కరుడు గట్టిన శత్రువును సైతం క్షమించి వేసేవారు.

ఇంకా ఏదైనా విషయం, ఏదైనా కార్యం జరిగేటప్పుడు తోటివారిని సంప్రదించటం, వారి సలహాలను తీసుకోవటం కూడా జరగాలి. సాధారణంగా ఈ విషయంపై కూడా అంతగా శ్రద్ధ చూపటం జరగదు. పెద్దవారు, బాధ్యులు అయినవారు తోటి వారిని దానికి అర్హులుగా భావించరు. లేదా చిన్నవారిని సంప్రదించటాన్ని

అగౌరవ సూచకంగా భావిస్తారు. కనుక స్వయంగా నిర్ణయాలు తీసుకుని దాన్ని ప్రకటిస్తారు. ఇంకా బలవంతంగా వారిపై రుద్దుతారు. దానిని వారు వ్యతిరేకిస్తారు. అప్పుడు వారందరి మధ్య అలజడి రేగుతుంది. ప్రశాంతత కనుమరుగవుతుంది. కనుక సత్సంబంధాల కోసం సలహా సంప్రదింపులు జరగటం తప్పనిసరి. అది చిన్న పనైనా సరే, పెద్ద పని అయినా సరే. దైవప్రవక్త(స) గారు సలహా సంప్రదింపులు తప్పకుండా జరిపేవారు.

పరస్పర సంబంధాలు బలంగా ఉండాలంటే ఒకరినొకరు తరచూ కలుసుకుంటూ ఉండాలి. ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకుంటూ ఉండాలి. కాని ఈ కలుసుకోవటం అనేది చిత్తశుద్ధితో జరగాలి. కేవలం అల్లాహ్ కోసమే కలుసుకోవాలి. అలాంటి వారిని అల్లాహ్ కూడా ప్రేమిస్తాడు. దైవప్రవక్త(స) జరిగిన ఒక సంఘటనను ఇలా వివరించారు: ఒక వ్యక్తి వేరే పట్టణంలో ఉన్న తన స్నేహితుణ్ణి కలవటానికి బయలుదేరాడు. అప్పుడు అల్లాహ్ అతను వెళ్తూ ఉన్న దారిలో ఒక దైవదూతను కూర్చోబెట్టాడు. ఆ దైవదూత ఆ వ్యక్తి కోసం నిరీక్షిస్తూ అక్కడే కూర్చున్నాడు. అప్పుడు ఆ వ్యక్తి అక్కడికి వచ్చాడు. ఆ వ్యక్తిని దైవదూత ఎక్కడికి వెళ్తున్నావు? అని అడిగాడు. దానికి అతను నేను ఫలానా నా మిత్రునితో కలుసుకునేందుకు వెళ్తున్నాను అని సమాధానం చెప్పాడు. ఆ నీ మిత్రుడు నీకు ఏమైనా ఉపకారం చేశాడా? అని ఆ వ్యక్తిని దైవదూత అడిగాడు. లేదు అని అతను సమాధానం చెప్పాడు. లేదా అతని హక్కు ఏదైనా నీపై ఉందా? అని అడిగాడు. దానికి ఆ వ్యక్తి లేదు అని సమాధానం చెప్పాడు. మరి దేనికోసం వెళ్తున్నావు అని ఆ వ్యక్తిని దైవదూత అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి నేను కేవలం అల్లాహ్ కోసం అతనితో స్నేహం చేశాను. అల్లాహ్ కోసమే అతనితో కలుసుకునేందుకు వెళ్తున్నాను అని సమాధానం పలికాడు. దానికి దైవదూత ఇలా అన్నాడు: నేను అల్లాహ్ దూతను. నేను నీకు ఒక శుభవార్తను తీసుకొచ్చాను. నీవు కేవలం అల్లాహ్ కోసమే అతన్ని ప్రేమిస్తున్నావు కాబట్టి అల్లాహ్ కూడా నిన్ను ప్రేమిస్తున్నాడు. ఈ విషయం చెప్పడానికే నేను నీ వద్దకు వచ్చాను అని అన్నాడు. (ముస్లిమ్). అల్లాహ్ ప్రేమ కంటే అధికమైన ప్రేమ మరెవరిదుంటుంది?

రక్త సంబంధీకులనైనా లేదా బంధుమిత్రులైనా కేవలం అల్లాహ్ కోసమే ప్రేమిస్తున్నప్పుడు, గౌరవిస్తున్నప్పుడు ఆ విషయాన్ని వారి ముందు బహిర్గతం చెయ్యాలి. ఉదాహరణకు, ఒక సెంటు సీసా మూతిని బిగించి ఉంచినట్లయితే దాని సువాసన బయటికి రాదు. దాని ద్వారా ఎవరూ ప్రయోజనం పొందలేరు. అదేవిధంగా మిత్రుత్వాన్ని బహిర్గతం చెయ్యకపోయినట్లయితే దాని పరిమళం ఎదుటివారికి తెలియకుండా పోతుంది. కాని బహిర్గతం చేసే విషయంలో వివేకాన్ని, మధ్యేమార్గాన్ని అవలంబించాలి.

ఇంకా మనిషి తన నాలుకను సక్రమమైన రీతిలో ఉపయోగించాలి. మంచి మాటలనే పలకాలి; దూరాలను పెంచే మాటలను వీడాలి. ఎందుకంటే మనిషి నాలుక ద్వారానే దూరంగా ఉన్న మనిషికి దగ్గరవుతాడు. దగ్గరగా ఉన్న మనిషికి దూరమై పోతాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: మంచి మాటలనే పలకండి. మంచి మాట కూడా సదఖా అవుతుంది. మంచిగా మాట్లాడడమంటే హృదయం విశాలంగా ఉండాలి. విశాల హృదయంతో పెద్దవారిని గౌరవిస్తూ పిల్లలను ప్రేమిస్తూ మాట్లాడాలి. దైవప్రవక్త(స) తన అనుచరులతోనూ, తెలిసినవారితోనూ, తెలియని వారితోనూ, చివరకు శత్రువులతోనూ ప్రేమగా, గౌరవంగా మాట్లాడేవారు. ఏనాడు ఆయన(స) చిరాకును, అసహనాన్ని ప్రదర్శించలేదు.

ఎదుటివారిని అపహాస్యం చెయ్యకూడదు. అతని లోపాలను గుర్తించి, ఇతరుల ముందు వాటిని చూసి నవ్వకూడదు. దైవప్రవక్త హజ్రత్ సులైమాన్(అ) ఇలా సెలవిచ్చారు: ఎవరైతే అగత్యపరులను చూసి నవ్వుతాడో, అతడు అతన్ని సృష్టించిన అతని ప్రభువుపై నవ్వుతాడన్న మాట.


లేఖరాయి

గీటురాయి పత్రికలో వస్తున్న వ్యాసాలపై
మీ అభిప్రాయాలు, సలహాలు, సూచనలను
geeturaiweekly@gmail.com కు
మెయిల్ చేయండి
లేదా
9640622076,
9396706460
నంబర్‌లకు వాట్సప్ చేయండి
మీ లేఖలను 'లేఖరాయి' శీర్షికలో ప్రచురిస్తాం.



# పిల్లలకు నీతికథలు చెబుతున్నారా?

- ముహమ్మద్ రఫీఖ్

**తల్లి..** రెండక్షరాలే. కాని దాని భావం అనంతం. జీవితంలో ఆమె పాత్ర అనిర్వచనీయం. తల్లి తన బిడ్డకు చిన్న ముల్లు గుచ్చుకున్నా భరించలేదు. బిడ్డకు ఏదన్నా జరిగితే తల్లి మనస్సు తల్లడిల్లి పోతుంది. వైద్యం చేయించడంతోపాటు అల్లాహ్ ముందు చేయి చాచి తన బిడ్డకి ఆయురారోగ్యాలు ప్రసాదించమని వేడుకుంటుంది. బిడ్డకు మంచి చదువులు చదివించి జీవితంలో నిలదొక్కుకునేలా చేయాలని తాపత్రయపడుతుంది. బిడ్డ ప్రాపంచిక జీవితం కోసం, భవిష్యత్తు కోసం చేయాల్సినన్ని త్యాగాలు చేస్తుంది.

కాని తమ బిడ్డలను స్వర్గ వనాలలోని పువ్వులు కాబోతున్నారో లేదా నరకానికి ఇంధనం కాబోతున్నారో ఎంతమంది తల్లులు ఆలోచిస్తున్నారు?

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: మనం పర్యవేక్షకులం. మన పర్యవేక్షణలో ఉన్న వారి గురించి మనల్ని ప్రశ్నించడం జరుగుతుంది.

మన పర్యవేక్షణలోనున్న మన పిల్లలకు ఎలాంటి శిక్షణ ఇచ్చామని అడగడం జరుగుతుంది.

అన్నిటికంటే ముందు తల్లిదండ్రులు తమ విశ్వాసాన్ని, ఆచరణలను పరిశీలించుకోవాలి. ఏదన్నా లోపం ఉంటే సంస్కరించుకోవాలి. సరైన విశ్వాసులుగా తీర్చిదిద్దుకోవాలి. ఆదర్శప్రాయులుగా మలచుకోవాలి. ఎందుకంటే, పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే సరళమైన విధానం వారికి మనం ఆదర్శప్రాయులుగా నిలవడమే. నమాజ్ చదివే తల్లుల పిల్లలు, తమకు అంత జ్ఞానం లేని వయసులోనూ జానిమాజ్ పట్టుకుని నమాజ్ చేయడానికి తల్లి పక్కనే నిల్చుంటారు. అనునిత్యం తిట్ల దండకం అందుకునే తల్లుల పిల్లలు తిట్లకు అలవాటు పడిపోతారు. నోరు తెరిస్తే తిట్ల పురాణం అందుకుంటారు.

కనుక మనం ఈ విషయాలను పరిశీలించుకోవాలి.

మన విశ్వాసం ఏ స్థాయిలో ఉంది? పరలోకం చింతన ఏ మేరకు ఉంది? మన పర్యవసానం పట్ల ఎంత భీతి కలిగి ఉన్నాం? పిల్లలతో, కుటుంబసభ్యులతో ఎలా మెలుగుతున్నాము? భార్యాభర్తల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి?

నిశ్చయంగా అబద్ధాలు పలికే, చాడీలు చెప్పే వారి సంతానం క్రమశిక్షణలు కలిగి ఉండటం అసంభవం (ఏదో కొందరు తప్ప). తల్లులు సంప్రదాయబద్ధమయిన దుస్తులు ధరిస్తే పిల్లలూ అటువైపు ఆసక్తి చూపుతారు. తండ్రి నిజాయితీపరుడయితే పిల్లలూ అలాగే తయారవుతారు.

ఈ విధంగా అన్ని వ్యవహారాల్లో తల్లిలో బాధ్యతా భావం ఎంత వరకు ఉందో చూడాలి. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుందా? లేదా బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నదా? తల్లిదండ్రులు ఎలా ఉంటారో పిల్లలూ అలాగే తయారవుతారు.

ఒక ప్రముఖ ధార్మికవేత్తకు ఎవరో ఫిర్యాదు చేశారు: తన సంతానం తనకు అవిధేయత చూపుతోందని. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'మీ జీవితాలను పరిశీలించుకోండి, మీరు అల్లాహ్‌కు ఏమాత్రం విధేయత చూపుతున్నారో! సంతానం విధేయులుగా ఉండాలంటే ముందుగా తల్లిదండ్రులు అల్లాహ్‌కు విధేయత చూపాలి. ఆయనకు భయపడాలి. అలాంటి వారి సంతానాన్ని దైవం పెడదోవ పట్టించడు''.

## ఇంటి వాతావరణం

తల్లిదండ్రుల తరువాత పిల్లలపై అత్యంత ప్రభావం చూపేది ఇంటి వాతావరణం. ఇంటి వాతావరణం ఇస్లామీయ విలువలకు ప్రతిరూపమయి ఉండాలి. అప్పుడే పిల్లలు ఇస్లామీయ విలువలతో తీర్చిదిద్దబడతారు. ఇస్లామీయ కట్టుబాట్లు, సంప్రదాయాలు పాటించని ఇంట్లో పిల్లలు ఈ ప్రపంచంలోకి రాకముందే ఇంటి వాతావరణాన్ని అల్లాహ్ ప్రవక్త(స) బోధనలకనుగుణంగా మలచేందుకు ప్రయత్నించాలి. సాధారణ జీవితాల నుంచి, పండుగలు, పబ్బాలు, వేడుకల వరకు అల్లాహ్ ఆదేశాల రంగులో రంగరించుకు పోతే పిల్లలకు కూడా అదే రంగు పులుముకుంటుంది. తల్లులు పిల్లలకు నీతికథలు చెప్పాలి. ప్రవక్తల జీవిత విశేషాలు తెలపాలి. వారి జీవితాల ద్వారా పిల్లలు స్ఫూర్తి పొందుతారు. సహాబాల విజయగాథలనూ, వారి జీవిత విశేషాలను వివరించాలి. వారు

తమ జీవితాలలో ఇస్లామ్‌ను ఎలా ఆహ్వానించారో, నాడు ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నారో తెలపాలి. బాల్యం నుంచే పిల్లలకు కలిమయె తయ్యిబా భావాన్ని నూరిపోయాలి.

మన ఇళ్ళల్లో ఇలాంటి వాతావరణం ఉందో లేదో ఒకసారి విశ్లేషించుకోవాలి. పిల్లలకు ధార్మిక విద్యనందిస్తున్నామా? పిల్లలు ఖుర్‌ఆన్, హదీసు బోధనల్ని ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారు? ఖుర్‌ఆన్ అనువాదాన్ని అర్థం చేసుకుంటున్నారా? ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం గురించి వారికి అవగాహన ఉందా? ఈ విషయాల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతున్నారో లేదో పరిశీలించుకోవాలి. పిల్లల వయసుకనుగుణంగా వారికి ఈ విషయాలు నేర్పాలి. వీటిని ఆచరించేలా వారిని ప్రోత్సహించాలి.

పిల్లలకు నమాజ్ చేసే అలవాటు చేయాలి. పదహారేళ్ళ వయసుకు వచ్చేవరకు వారు నమాజ్ చేస్తున్నారో లేదో పర్యవేక్షించాలి. నమాజ్ చేయమని చెబుతుండాలి. తోడుగా వారిని మస్జిద్‌కు తీసుకు వెళ్ళాలి. అలా వారిని నమాజ్‌కు అలవాటు చేయాలి.

బాల్యం నుంచే పిల్లల క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పిల్లలు క్రమశిక్షణగా ఉండాలంటే మొదట తల్లిదండ్రులు క్రమశిక్షణతో ఉండాలి. పెద్దలను చూసి పిల్లలు చాలా నేర్చుకుంటారు. పెద్దల్లో క్రమశిక్షణ లేకపోతే పిల్లలు కూడా అలాగే తయారవుతారు. పెద్దలు పిల్లలకు ఆదర్శప్రాయంగా నిలవాలి. వారిలో ఉన్నత నైతిక గుణగణాలను పెంపొందించేలా చూడాలి.

# ఐదు హితబోధలు

**హజ్రత్** అబూహురైరా(రజి) ఇలా అంటున్నారు : ఒకరోజు ప్రవక్త(స) నిండు సభలో మమ్మల్ని ప్రశ్నించారు. అప్పుడు సహాబా అందరూ ఉన్నారు. ఆయన(స) ఇలా అడిగారు: "నా వద్ద కొన్ని విషయాలు నేర్చుకుని, వాటిని స్వయంగా ఆచరించి, ఇతరులకు నేర్పేవారు మీలో ఎవరయినా ఉన్నారా? దానికి అందరూ మౌనంగా ఉన్నారు. ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడు నేను లేచి 'ఓ దైవప్రవక్తా! మీరు ఏ విషయాలు నేర్పాలనుకుంటున్నారో నాకు చెప్పండి. నేను మీ నుంచి నేర్చుకుంటాను. ఆచరిస్తాను. వాటిని ఇతరులకు కూడా నేర్పుతాను' అన్నారు. అబూ హురైరా(రజి) ఇంకా ఇలా అంటున్నారు. అప్పుడు ప్రవక్త(స) నన్ను పిలిచారు. నేను ఆయన వద్దకు వెళ్ళాను. ఆయన(స) నా చెయ్యి పట్టుకుని ఈ ఐదు విషయాల గురించి హితబోధ చేశారు :

1) నిన్ను నువ్వు హరామ్ విషయాలకు దూరంగా ఉంచుకుంటే నీవు అత్యంత గొప్ప ఆరాధకునివి అవుతావు.

హరామ్ అనేక రకాలు : కొన్ని అన్నపానీయాలలో, కొన్ని చూడడంలో, కొన్ని వినడంలో ఉన్నాయి. ఇలా అన్ని రకాల అధర్మ విషయాలకు దూరంగా ఉండడమూ ఆరాధనగానే పరిగణించబడుతుంది.

ఏ విధంగానయితే పుణ్యాలు పాపాలను హరించివేస్తాయో అదేవిధంగా పాపపు పనులు పుణ్యాలను హరించి వేస్తాయి.

సౌబాన్ (రజి) ప్రవక్త (స)ను ప్రవచిస్తుండగా తాను విన్నానన్నారు. ఆయన(స) ఇలా అన్నారు: ప్రజలారా! గుర్తుంచుకోండి. నాకు బాగా తెలుసు. అల్లాహ్ నాకు తెలిపాడు. ప్రళయం నాడు నా సముదాయం వారు చాలా మంది ఎన్నో పుణ్యకార్యాలు, సత్కార్యాలు తీసుకుని వస్తారు. అవి పర్వత శిఖరాల్లా ఉంటాయి. వాటన్నింటిని వారికి చూపించడం జరుగుతుంది. కాని కొన్ని క్షణాల్లోనే అవి పరమాణువుల్లా గాలిలో కలిపోతాయి. అవేమీ వారికి పనికిరావు. అప్పుడు సహాబా వాళ్ళు ఎవరు? అని అడిగారు. ప్రవక్త(స) 'వారు తమను తాము హరామ్ విషయాలకు దూరంగా ఉంచుకోనివారు'. గుర్తుంచుకోండి! వారు తిరస్కారులో, బహు దైవారాధకులో, యూదులో కాదు వారు ముస్లిం సోదరులే. మరి వారు సామాన్యులు కాదు, చాలా గొప్ప వారు. మీలాగే తహజ్జుద్ చేస్తారు, గొప్ప ఆరాధకులు, చాలా మంచివారు కూడా. కాని వారు చేసిన నేరం ఏమిటంటే, వారు హరామ్ విషయాలకు దూరంగా ఉండే వారు కాదు. హరామ్ విషయాలకు పాల్పడటం చాలా ఘోరమైన విషయం. వాటిని విడనాడితే గొప్ప ఆరాధకుల మవుతాము.

2) అల్లాహ్ నీ అదృష్టంలో ఎంత ఇచ్చాడో దానికి సంతృప్తి చెందు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకో. ఆయన నిన్ను కరుణించాడని భావించు.

డబ్బు విషయంలో మనం మనకంటే తక్కువ వారిని చూడాలి. మన తలరాతపై సంతృప్తి చెందితే అల్లాహ్ మరింత ప్రసాదిస్తాడు.

3) నువ్వు దేన్నయితే ఇష్టపడుతున్నావో దాన్నే మీ సోదరుల కోసం ఇష్టపడు. అప్పుడే నీవు విశ్వాసిగా పరిగణించబడతావు. మనకు నష్టం జరగాలని, హాని జరగాలని కోరుకోము. మన కోసం ఇష్టపడిన వాటినే మన సోదరుల కోసం ఇష్టపడాలి.

4) నీ పొరుగువారి పట్ల ఉపకారం చెయ్యి. వారితో మంచిగా వ్యవహరించు. అప్పుడే నువ్వు విశ్వాసిగా పరిగణించబడతావు. పొరుగువారు ఎవరయినా సరే ఏ మతానికి, ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారయినా వారి పట్ల మంచిగా ఉండాలి.

5) అధికంగా నవ్వకు. అధికంగా నవ్వితే హృదయం నిర్జీవం అవుతుంది.

ఈ ఐదు హితబోధలు ప్రవక్త(స) అబూ హురైరా (రజి)కి చేశారు. వీటిని ఆయన ఆచరించారు, ఇతరులకూ చెప్పారు. మనం కూడా వీటిని ఆచరించి ఇతరులకూ చెబుదాం....




## పార్టీకి ద్రోహం చేయం

బీజేపీ ప్రలోభాలకు లొంగి ఆప్ ఎమ్మెల్యేలు పార్టీకి ద్రోహం చేయరని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా కాషాయ పార్టీని హెచ్చరించారు. బీజేపీలో చేరితే రూ.20 కోట్లు ఇస్తామని నలుగురు ఆప్ ఎమ్మెల్యేలకు కాషాయ పార్టీ ఆఫర్ చేసిందని ఆప్ ఎం.పీ సంజయ్ సింగ్ వెల్లడించిన క్రమంలో సిసోడియా స్పందించారు. తనను ఆప్ నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు విఫలయత్నం చేసిన బీజేపీ ఆపై తమ ఎమ్మెల్యేలకు రూ. 20 కోట్లు ఆఫర్ చేసిందని, ఈడీ, సీబీఐలతో బెదిరింపులకు దిగుతోందని ఆరోపించారు. ఆప్‌ను చీల్చేందుకు బీజేపీ తాజా కుట్రకు తెరలేపిందని అన్నారు. బీజేపీ ఇలాంటి పనులకు దూరంగా ఉంటే మంచిదని మనీష్ సిసోడియా హితవు పలికారు.

## గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు



బిల్కిస్ బానో దోషుల్ని విడుదల చేసిన అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 11 మంది దోషులను విడుదల చేయడం గురించి వివరణ ఇవ్వాలంటూ గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బిల్కిస్‌బానో రేప్ కేసులో నిందితులుగా ఉన్న 11 మందిని పంద్రాగస్టు రోజున గుజరాత్ ప్రభుత్వం రిలీజ్ చేసింది. కాలం చెల్లిన రెమిషన్ విధానం ప్రకారం వారిని రిలీజ్ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతోంది. గుజరాత్ ప్రభుత్వ తీరును విపక్షాలు ఖండిస్తూ నిలదీస్తున్నాయి. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు.. నిందితుల విడుదల గురించి వివరణ ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని కోరింది.

## స్థానికేతరుల్ని ఓటరు జాబితాలో చేర్చే ప్రసక్తే లేదు

జమ్ముకాశ్మీర్ ఓటర్ల జాబితాలో స్థానికేతరుల్ని చేర్చడాన్ని ఇక్కడి పార్టీలకు ఎంతమాత్రం సమ్మతం కాదని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఫారూక్ అబ్దుల్లా తేల్చి చెప్పారు. జమ్ముకశ్మీర్ గుర్తింపును నాశనం చేయడానికే దీనిని తెచ్చారని అన్నారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించిన ఫారూక్ అబ్దుల్లా ఈ నిర్ణయాన్ని చట్టబద్ధంగా సవాల్ చేయడంతో సహా అన్ని విధాలా సవాల్ చేయనున్నట్లు తెలిపారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పిడిపి చీఫ్ మహబూబా ముఫ్తీ, కాంగ్రెస్ జమ్మూ కశ్మీర్ రాష్ట్ర అధ్యక్షుడు వికార్ రసూల్‌తో సహా పలు పార్టీల నేతలు హాజరయ్యారు. సమావేశం అనంతరం నేషనల్ కాన్ఫరెన్స్ నేత మీడియాతో మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్ ఓటర్ల జాబితాలోకి స్థానికేతరుల్ని చేర్చడాన్ని అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు. ఇక్కడి ప్రజలను నిరాకరిస్తూ, బయటివారి చేతుల్లోకి అసెంబ్లీ వెళ్లడాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు.

## బాధితుడినే నిందితునిగా మార్చారు

ఢిల్లీ అల్లర్ల విషయమై దర్యాప్తు జరిగిన తీరుపై కోర్టు ఆక్షేపణ తెలిపింది. బాధితుడినే నిందితునిగా పేర్కొనడాన్ని ప్రశ్నించింది. 2020 ఫిబ్రవరి 25న ఢిల్లీలో జరిగిన ఘర్షణల్లో సాజిద్ అనే వ్యక్తికి వెనుక నుంచి తుపాకీ గుండు తగిలింది. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆరుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. తూటా తగిలింది కాబట్టి ఆయన కూడా అల్లర్లలో పాల్గొన్నట్టేనని భావించిన పోలీసులు ఆయనను కూడా నిందితునిగా చేర్చారు. అంతేకాకుండా ప్రాసిక్యూషన్ ఆయనను ప్రధాన సాక్షిగా కూడా పేర్కొంది. ఈ కేసులో బాధితుడ్నే నిందితునిగా పేర్కొనడాన్ని అదనపు సెషన్స్ జడ్జి అమితాబ్ రావత్ ప్రశ్నించారు. తాను నిందితునిగా ఉన్న కేసులో సాక్షిగా కూడా ఎలా ఉండగలుగుతారని అడిగారు. ఈ విచారణ మొత్తం అసంబద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు.

## 'అజాన్' తో హక్కుల భంగం కాదు

మస్జిదుల్లో ఇచ్చే అజాన్ వల్ల ఎవరి హక్కులకూ భంగం వాటిల్లదని ముఖ్యంగా ఇతర మతస్థుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినట్టు కాదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. మస్జిదుల్లో లౌడ్ స్పీకర్లను నిలిపేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. అయితే పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అజాన్ ముస్లింలకు సంబంధించిన కార్యక్రమమని, దీనివల్ల ఇతర మతస్థుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 పరమత సహనాన్ని పేర్కొంటున్నాయని, ముఖ్యంగా ఆర్టికల్ 25(1) ప్రకారం వ్యక్తులు తమ మత విషయాలను స్వేచ్ఛగా వెల్లడించేందుకు.. ప్రార్థనలు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఈ కేసులో అజాన్ వల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందనే వాదనను తాము విశ్వసించడం లేదని పేర్కొంది.




## రాజ్యానికి మతంతో సంబంధం ఉండరాదు

రాజ్యానికి మతంతో సంబంధం ఉండ కూడదని, చర్చిలకు రాజకీయ పార్టీలు ఉండరాదని బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు లూలా డసిల్వా స్పష్టం చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థి, పచ్చి మితవాది జైరే బోల్సనారో ఓటర్లను ఆకట్టుకోడానికి ఇటువంటి నీతిమాలిన చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో లూలా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బ్రెజిల్ లౌకిక స్వభావాన్ని పరిరక్షించేందుకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని లూలా అన్నారు. రాజ్యానికి మతంతో సంబంధం ఉండరాదు, చర్చిలు రాజకీయ పార్టీలను కలిగివుండరాదు ఇదే తన వైఖరి అని అన్నారు.

## మాకు మరో చెర్నోబిల్ వద్దు

'మాకు మరొక చెర్నోబిల్ దుర్ఘటన వద్దు' అని టర్కీ అధ్యక్షుడు రజబ్ తయ్యిబ్ ఎర్డోగన్ అన్నారు. ఆయన ఇటీవల ఉక్రెయిన్ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియా గుటెరస్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌లో నిర్వహించిన త్రైపాక్షిక సమావేశంలో ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై చర్చించారు. సమావేశం అనంతరం ఎర్డోగన్ మాట్లాడుతూ 'మేము ఆందోళన చెందుతున్నాం, మాకు మరొక చెర్నోబిల్ ఘటన వద్దు' అని పేర్కొన్నారు. ఈ యుద్ధం ముగింపునకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని, ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తామని తెలిపారు. అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రానికి ఏదైనా నష్టం జరిగితే అది ఆత్మహత్యతో సమానమని ఎర్డోగన్‌తో చర్చల సందర్భంగా ఐరాస చీఫ్ గుటెరస్ హెచ్చరించారు. ప్లాంట్‌లోని పరిస్థితులపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు.

## టిప్పు సుల్తాన్ కత్తితో సహా 7 కళా ఖండాలు భారత్‌కు తిరిగి ఇవ్వనున్న బ్రిటన్

భారత్‌ను రెండు వందల సంవత్సరాల పాటు పాలించిన బ్రిటిష్ పాలకులు.. ఎన్నో అద్భుతమైన వస్తువులను ఇక్కడి నుంచి దోచుకెళ్లారు. ఆ తర్వాత వీటిని తమవిగా చెప్పుకుంటూ మ్యూజియాలకు అప్పగించారు. ఇలా స్కాట్లాండ్‌లోని గ్లాస్గో మ్యూజియంకు అందించిన ఏడు వస్తువులను అధికారులు భారత్‌కు తిరిగి అప్పగించారు. గ్లాస్గో లైఫ్ సంస్థతో భారత హై కమిషన్ ప్రతినిధులు 18 నెలలపాటు చర్చించిన అనంతరం.. ఈ వస్తువులను భారత్‌కు అప్పగించడానికి అధికారులు అంగీకరించారు. వాటిలో టిప్పు సుల్తాన్ కత్తి కూడా ఉంది. ఇది 1905లో హైదరాబాద్ మ్యూజియం నుండి దొంగిలించబడింది. దానిని బ్రిటిష్ జనరల్ ఆర్కిబాల్డ్ హంటర్‌కు విక్రయించారు.

## భారత్‌లో పర్యటించనున్న బంగ్లా ప్రధాని హసీనా

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా సెప్టెంబర్ 5 నుంచి మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆమె రక్షణ సహకారం, ప్రాంతీయ సుస్థిరత గురించి చర్చించనున్నారు. 2019 తర్వాత ఆమె పర్యటన ఇదే తొలిసారి. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించి కూడా బంగ్లాదేశ్, భారత్ ప్రధానుల మధ్య చర్చలు జరగనున్నాయి.

## అఫ్గానీయులకు శరణార్థ హోదా కల్పించిన జపాన్

అఫ్గానిస్తాన్ నుంచి వలస వెళ్ళిన 98 మందికి జపాన్ శరణార్థ హోదాను మంజూరు చేసింది. గత ఏడాది అఫ్గాన్‌ను విడిచి వచ్చిన ఆ దేశీయుల్లో కాబూల్‌లోని జపాన్ రాయబార కార్యాలయంలో పని చేసిన సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కూడా శరణార్థ హోదాను ఇచ్చింది. వీరితో పాటు జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ, ఇతర ప్రైవేట్ కంపెనీలకు చెందిన ఉద్యోగులకు కూడా శరణార్థ హోదాను కల్పించింది.

## పిల్లల్ని కంటే భారీ నజరానా

రష్యాలో జనాభా తగ్గుతున్న నేపథ్యంలో.. తిరిగి జనాభా పెంచుకునేందుకు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అక్కడి మహిళలకు నజరానా ప్రకటించారు. 'మదర్ హీరోయిన్' పేరిట సోవియట్ కాలంలో ఉన్న పురస్కారాన్ని పునరుద్ధరించనున్నారు.10 కన్నా ఎక్కువ మంది పిల్లలను కనే వారికి రూ.13 లక్షల రివార్డును ఇవ్వనున్నట్టు తెలిపారు. 10వ బిడ్డ పుట్టిన ఏడాదికి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అయితే అప్పటికీ మిగిలిన 9 మంది పిల్లలు జీవించి ఉండాలని షరతు విధించారు. నిజానికి ఈ అవార్డును 1944లో అప్పటి సోవియట్ ప్రీమియర్ జోసెఫ్ స్టాలిన్ ప్రవేశ పెట్టారు. యూఎస్ఎస్ఆర్ గౌరవ పురస్కారంగా పేర్కొంటూ దాదాపు 4 లక్షల మంది పౌరులకు ఈ అవార్డు అందజేశారు. ఇప్పుడు రష్యా జనాభా పెంచడానికి ఈ అవార్డును మళ్లీ వెలుగులోకి తీసుకురావడం గమనార్హం.

# మన జీవితం స్వల్ప పరీక్షా వ్యవధి

- డాక్టర్ సమీఉజ్జమా

## నా ప్రియ సోదరి, సోదరుడా!

నేను, మీరు ఈ ప్రాపంచిక జీవితమే సర్వస్వమని అనుకుంటే, ధర్మబద్ధంగానో, అధర్మంగానో ప్రపంచాన్ని పొందడమే విజయ మనుకుంటే మన ఆచరణా ధోరణి భిన్నంగా ఉంటుంది. కానీ ఈ జీవితాన్ని పరీక్షగా భావిస్తే మన వైఖరి వేరుగా ఉంటుంది. దైవప్రవక్తలంతా, దేవుని చివరి గ్రంథమూ ఈ ప్రాపంచిక జీవితం స్వల్ప పరీక్ష వ్యవధి మాత్రమేనని ఘోషిస్తు న్నాయి. ఈ పరీక్ష మీదనే రాబోయే శాశ్వత జీవితం ఆధారపడి ఉంది. ఈ సత్యాన్ని తెలుసుకోకుంటే జీవితం నిర్లక్ష్యంగా గడిచిపోతుంది. ఉన్నపళంగా మృత్యువు కబళిస్తుంది. మనల్ని పుట్టించిన ఆ సృష్టికర్త దైవగ్రంథంలో హెచ్చరిస్తున్నాడు:

ప్రజలారా! మీరు చేసే ఈ తిరుగుబాటు మీకే హాని కలిగి స్తుంది. ఇహలోక జీవిత సుఖాలు కొన్ని రోజుల సుఖాలు మాత్రమే (వాటిని అనుభవించండి). తరువాత మా వైపునకే మీరు మరలిరావలసి ఉన్నది. అప్పుడు మేము మీకు తెలుపుతాము, మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో. ఈ ప్రాపంచిక జీవితాన్ని (దాని నిషాలోపడి మీరు మా సూచనల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారు) ఇలా పోల్చవచ్చు- మేము ఆకాశం నుండి నీటిని కురిపించగా మనుషులూ పశువులూ అందరూ తినే భూఉత్పత్తులు బాగా దట్టంగా తయారయ్యాయి. ఆపై భూమి మంచి స్థితిలో ఉన్నప్పుడు పొలాలు బాగా పండి శోభిల్లుతూ ఉన్నప్పుడు వాటి యజమానులు, "ఇక మేము వాటివల్ల లాభం పొందగలము" అని అనుకుంటున్న సమయంలో, అకస్మాత్తుగా రాత్రి వేళనో పగటిపూటనో మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము అసలు అక్కడ నిన్న ఏమీ లేనట్లు దానిని సర్వనాశనం చేశాము. ఇలా మేము మా సూచనలను స్పష్టంగా వివరిస్తాము.

(దివ్య ఖుర్ఆన్ 10:23-24)

భూమిపై ఉన్న వస్తు సామగ్రినంతటినీ మేము భూమికి అలంకారంగా చేశాము. చివరకు మేము దీనినంతటినీ చదునైన మైదానంగా చేసివేయనున్నాము.

(దివ్య ఖుర్ఆన్ 18:7-8)

మీరు పరలోకానికి మారుగా ప్రాపంచిక జీవితాన్ని కోరుకు న్నారా? అలా అయితే మీరు తెలుసుకోవాలి, ప్రాపంచిక జీవితపు సకల సామగ్రి పరలోక సుఖాల ముందు స్వల్పాతి స్వల్పమైనదిగా తేలుతుందని. (దివ్యఖుర్ఆన్ 9:38)

అల్లాహ్ తన ఇష్టప్రకారం కొందరికి ఎక్కువ జీవనోపాధిని ప్రసాదిస్తాడు, మరికొందరికి తక్కువ జీవనోపాధిని ప్రసాది స్తాడు. వారు ప్రాపంచిక జీవితంలో మునిగిపోయి ఉన్నారు. వాస్తవానికి పరలోకం ముందు ప్రాపంచిక జీవితం ఒక చిరుసంపద తప్ప మరేమీ కాదు. (దివ్య ఖుర్ఆన్ 13:26)

మనం శ్వాస తీసుకుంటున్న ఈ జీవిత ఘడియలు స్వల్ప మైనవి. రాబోయే శాశ్వతమైన జీవితంలో జయాపజయాల కోసం ఈ జీవితంలో కర్మలు చేస్తున్నాము. ఈ సత్యాన్ని తెలుసు కోకుండా మనం జీవితాన్ని ఏమరుపాటులో గడుపుదామా? లేదంటే సత్యాన్ని అన్వేషించి దానికనుగుణంగా ప్రణాళికబద్ధంగా జీవితాన్ని గడుపుదామా? ఈ నిర్ణయం మన చేతుల్లోనే ఉంది. ఫలితం మన ముందుం టుంది. ఆ ఘడియలో మనకు కర్మలు చేసుకునే అవకాశం ఏ మాత్రం దొరకదు. ఆలోచించండి. చింతన చేయండి.

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**